నేటి కందం-నేటికి అందం

అతులిత ధనరాశులతో
గతిలో బళ్ళారి గుంతకల్లుల నడుమన్
చతురత రైల్వే వృద్ధికి
మతిమంతుడు మోడి నెరపె మంత్రాంగమ్మున్ !!
(బళ్ళారి గుంతకల్లు పట్టణాల మధ్య రైల్వే లైన్ల అభివృద్ధికి మోడీ 1264 కోట్ల రూపాయలు మంజూరు చేశారు. దీని వల్ల ప్రజలకు వ్యాపార, వాణిజ్య అవసరాలకు చాలా ఉపయోగం ఉంటుంది. దాని వల్ల ఎందరికో జీవనోపాధి లభిస్తుంది.)
-రాధశ్రీ
సెల్:9494481210



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

చురక

కేంద్ర మంత్రి రాజీనామా
కాక్రోచుల భారీ గెలుపు
సంఘటిత ఉద్యమాల
చైతన్యం గొప్ప మలుపు.
తప్పుచేసే పాలకుల
తప్పించే హెచ్చరిక
గుణపాఠం నేర్చుకోక
గతితప్పితే ఆగదిక
-వేల్పుల నారాయణ
9440433475



హైదరాబాద్ ఆదివారం 26-7-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:276 పేజీలు:6 వెల: రూ.1/-

## తాగునీటి సమస్య పరిష్కారానికి 100 రోజుల యాక్షన్ ప్లాన్ సిద్ధం: మంత్రి సీతక్క



హైదరాబాద్, జులై 25: మిషన్ భగీరథపై మంత్రి సీతక్క ఈరోజు(శనివారం) రాష్ట్ర సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. తాగునీటి సమస్యలు రాకుండా 100 రోజుల యాక్షన్ ప్లాన్ సిద్ధంగా ఉందన్నారు. సింగూరు, పాలేరు నీటి నిల్వలపై నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రోజువారీ రిజర్వాయర్ల నీటిమట్టాలను సమీక్షించాలని సూచించారు.

స్థానిక నీటి వనరులను వినియోగించేలా కార్యాచరణ రూపొందించాలిని ఆదేశించారు. బోర్‌వెల్స్ వద్ద రీఛార్జింగ్ పిట్స్, రైన్‌వాటర్ హార్వెస్టింగ్ పనులు వేగవంతం చేయాలని తెలిపారు.

గ్రామాల వారీగా వాట్సాప్ గ్రూపులతో నీటి సరఫరాపై సమాచారం అందించాలని మంత్రి సూచనలు చేశారు.

మహిళా సంఘాలు, సర్పంచ్‌లు, వార్డు సభ్యుల సమన్వయంతో నీటి నిర్వహణ చేపట్టాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు రాకూడదని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

## బొద్దింకలతో పెట్టుకోవద్దు: అభిజీత్ దీప్కే



న్యూఢిల్లీ, జులై 25: కేంద్ర మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై చేయడంపై సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే స్పందించారు. జంతర్ మంతర్ వేదికగా ఆయన మాట్లాడుతూ బొద్దింకల సత్తా అందరికీ తెలిసొచ్చిందని అన్నారు. నీట్ పేపర్ లీక్ బాధితులకు న్యాయం దక్కిందని వ్యాఖ్యానించారు. బొద్దింకలు ఒకసారి వస్తే వెళ్లగొట్టడం సాధ్యం కాదని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ఇది విద్యార్థుల విజయమని అన్నారు. తమని తాము బాద్షాలుగా భావిస్తున్న వారిని దారిలోకి తేవాల్సిన అవసరం ఉందని అన్నారు. యువత ఓట్లతోనే వారు నేడు అధికారంలో ఉన్నారని అన్నారు. ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని చెప్పారు. పాలకులను అదుపులో ఉంచాల్సిన అవసరం ఉందని కూడా ఉన్నారు.

తాము పెట్టిన రెండు డిమాండ్స్ ఇంకా మిగిలే ఉన్నాయని దీప్కే అన్నారు. అవి సాధించేవరకూ ముందుకు సాగుతూనే ఉంటామని అన్నారు. మరికొద్ది సేపట్లో సీజేపీ ప్రతినిధులు కేంద్ర మంత్రులతో సమావేశం కానున్న నేపథ్యంలో ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు ప్రాధాన్యం ఏర్పడింది. నీట్ పేపర్ లీక్‌కు బాధ్యత వహిస్తూ తాను తప్పుకుంటున్నట్టు కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఎక్స్ వేదికగా ప్రకటించిన విషయం తెలిసిందే.

## కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా



న్యూఢిల్లీ, జులై 25:కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. నీట్ పేపర్ లీకేజీ అంశం నేపథ్యంలో ఆయన తన రాజీనామాను సమర్పించారు. కాక్రోచ్ జనతా పార్టీ దేశవ్యాప్తంగా ప్రధాన్ రాజీనామా కోరుతూ ఆందోళనలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే అని పార్లమెంట్‌లో విపక్ష పార్టీలు కూడా డిమాండ్ చేశాయి. పార్లమెంట్ సమావేశాలను గత వారం నుంచి విపక్షాలు ఈ అంశంపైనే స్తంభింప చేశాయి.

జూలై 20వ తేదీన కాక్రోచ్ జనతా పార్టీ నిర్వహించిన చలో పార్లమెంట్ హింసాత్మకంగా మారడంతో.. విపక్షాలు కూడా తమ గళాన్ని తీవ్రం చేశాయి. విద్యార్థి లోకంతో పాటు విపక్షాలు కూడా డిమాండ్ చేయడంతో.. మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చివరకు ఇవాళ తన రాజీనామాను సమర్పించారు. ధర్మేంద్ర ప్రధాన్ తన ఎక్స్ అకౌంట్‌లో .. హిందీ భాషలో ఓ లేఖను రిలీజ్ చేశారు.

ఢిల్లీ నిరసనల వేళ పోలీసులు సీజేపీ కార్యకర్తలపై టియర్ గ్యాస్ ప్రయోగించారు. లాఠీఛార్జ్ కూడా చేశారు. ఆ సమయంలో అనేక మంది సీజేపీ విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. దీంతో దేశవ్యాప్తంగా ఉద్యమం ఉధృతమైంది. బీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద శుక్రవారం నిర్వహించిన భారీ నిరసన కార్యక్రమానికి మహానగరంతో పాటు రాష్ట్ర నలుమూలల నుంచి వేలాది మంది యువతీ యువకులు దండుకట్టి తరలివచ్చారు. మోదీ సర్కారు లీకిన్ ఇండియాగా మారినట్లు కేటీఆర్ తన ప్రసంగంలో ధ్వజమెత్తారు.

దేశరాజధానిలోని జంతర్ మంతర్‌లో నెల రోజుల నుంచి కాక్రోచ్ పార్టీ కార్యకర్తలు క్యాంప్ పెట్టారు. తమ ఆందోళనలకు సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ కూడా మద్దతు తెలిపారు. ఆయన సుమారు 26 రోజుల పాటు నిరాహార దీక్ష చేశారు. ఆ తర్వాత ప్రభుత్వం ఆయన్ను బలవంతంగా ఆస్పత్రికి తరలించింది. చివరకు కేంద్ర మంత్రులతో మాట్లాడి ఆయన తన దీక్షను విరమించారు. కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే మాత్రం ఆందోళన మార్గాన్ని వీడలేదు. జంతర్ మంతర్ నుంచి వాంగ్‌చుక్‌ను తప్పించినా..ఆ స్థానంలో దీప్కే తన దీక్షను కొనసాగించారు.

విద్యార్థులు మొదలు పెట్టిన ఆందోళన.. అనూహ్య పరిణామాల నేపథ్యంలో రాజకీయ రచ్చగా మారింది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం వల్ల .. ఆ శాఖను ఎవరికి అప్పగిస్తారన్న ఆసక్తి పెరిగింది. ప్రస్తుతం ప్రధాన్ వారసుడెవరన్నది ఇంకా తెలియదు. అయితే సీజేపీ నేతలతో మూడో దఫా చర్చలు జరగనున్న నేపథ్యంలో ఆ అంశం ఆసక్తికరంగా మారింది. తాజా సంక్షోభాన్ని తెరదించే విషయంలో.. ఇది కీలకమైన రాజకీయ ఎత్తుగడగా మారే అవకాశాలు ఉన్నాయి.

నీట్ పేపర్ లీకేజీ పెను దుమారాన్ని క్రియేట్ చేసింది. ఆ పేపర్ లీక్ కావడంతో విద్యార్థులు తీవ్ర ఆందోళన చెందారు. ఆ పరీక్షకు చెందిన 100 ప్రశ్నలు లీకయ్యాయి. ఆ కేసులో దర్యాప్తు చేపట్టిన కేంద్రం 13 మందిని అరెస్టు చేసింది. కొన్ని కోచింగ్ సెంటర్లపై కూడా కొరఢా రుళిపించింది. తొలుత మే 3వ తేదీన పరీక్ష జరిగింది. లీక్ కావడంతో మళ్లీ జూన్ 21వ తేదీన రీఎగ్జామ్ నిర్వహించారు. ప్రస్తుతం ఆ పరీక్ష ఫలితాలు వెల్లడయ్యాయి. నీట్ అడ్మిషన్ ప్రక్రియ త్వరలో ప్రారంభంకానున్నది.

## మైక్రో ఇరిగేషన్ కంపెనీలతో మంత్రి తుమ్మల భేటీ..

### -రైతులకు అండగా నిలవాలని పిలుపు..



హైదరాబాద్, జులై 25: తెలంగాణ సచివాలయంలో మైక్రో ఇరిగేషన్ కంపెనీలతో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమావేశమయ్యారు. ఎల్-నినో సమయంలో రైతులకు అండగా నిలవాలని మైక్రో ఇరిగేషన్ కంపెనీలకు తుమ్మల పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎల్-నినో సవాళ్లకు డ్రిప్, తుంపర సేద్యమే పరిష్కార మార్గమని ఆయన పేర్కొన్నారు. డ్రిప్ వ్యవస్థల ఏర్పాటును వేగవంతం చేయాలని ఆ కంపెనీలకు మంత్రి సూచించారు. పెండింగ్‌లో ఉన్న డ్రిప్ పనులకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. బీఎంఎస్, బీఓక్యూలను పూర్తి చేసి వెంటనే అనుమతుల కోసం పంపాలని ఆదేశించారు. క్షేత్రస్థాయి పరిశీలన, పరిపాలనా అనుమతుల్లో జాప్యానికి తావివ్వొద్దని మంత్రి తుమ్మల సూచించారు.

డ్రిప్ వ్యవసాయ పద్ధతిలో తక్కువ నీరు, విద్యుత్ ఉపయోగించి అధిక దిగుబడి సాధించవచ్చని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. పంటల వైవిధ్యీకరణకు మైక్రో ఇరిగేషన్ కీలకమని అన్నారు. ఆయిల్‌పామ్ సాగుకు డ్రిప్ సదుపాయాలను వెంటనే కల్పించాలని మైక్రో ఇరిగేషన్ కంపెనీలకు హుకుం జారీ చేశారు. అవగాహన కార్యక్రమాల్లో ఆయా కంపెనీలు తప్పనిసరిగా పాల్గొనాలని, పెండింగ్ బిల్లుల చెల్లింపునకు కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. గత రెండేళ్లలో మైక్రో ఇరిగేషన్ కంపెనీలకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.400 కోట్లు చెల్లించిందని ఈ సందర్భంగా వెల్లడించారు. కంపెనీల పనితీరుపై జిల్లాల వారీగా నిరంతర సమీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. సూక్ష్మ సాగునీటి విస్తరణలో దేశానికి తెలంగాణ ఆదర్శంగా నిలవాలని మంత్రి తుమ్మల ఆకాంక్షించారు.


## భారతీయులు ఉన్న నౌకపై ఇరాన్ జలాల్లో దాడి.. 28 మంది సురక్షితం

న్యూఢిల్లీ, జులై 25:28 మంది భారతీయులు పనిచేస్తున్న నౌకపై ఇరాన్ జలాల్లో దాడి జరిగింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి హానీ కలగలేదని, భారతీయులు సహా నౌకలోని సిబ్బంది అంతా సురక్షితంగా ఉన్నారని ఇరాన్‌లోని భారత రాయబార కార్యాలయం ప్రకటించింది. మొజాంబిక్ దేశానికి చెందిన ఐఎంవో నెం.8818219 అనే దిశ పేరుగల నౌకపై దాడి జరిగిందని రాయబార కార్యాలయం తెలిపింది.

ఈ ఘటనపై సంబంధిత అధికారులను సంప్రదిస్తున్నామని తెలిపింది. దాడి జరిగిన నౌకలో 28 మంది భారతీయ సిబ్బంది ఉన్నారని, వారంతా సురక్షితంగా ఉన్నారని వివరించింది. అధికారులను సంప్రదిస్తూ పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్నామని రాయబార కార్యాలయం తెలిపింది. అయితే, ఈ దాడికి కారకులు ఎవరు, ఎలా దాడి జరిగింది అనే వివరాల్ని మాత్రం అధికారులు వెల్లడించలేదు. నౌకకు ఏమైనా నష్టం వాటిల్లిందా అనే విషయంలో కూడా స్పష్టత లేదు. అంతకుముందు రోజే కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జైశంకర్ ఈ తరహా దాడుల్ని ఖండించారు. వాణిజ్య నౌకలు, పౌర నౌకలపై జరుగుతున్న దాడులను ఆయన ఖండించారు.

మనీలాలో గురువారం జరిగిన ఈస్ట్ ఏసియా సదస్సులో జైశంకర్ పాల్గొన్నారు. అంతర్జాతీయ జలాల్లో భద్రత ఉండాలని, అంతర్జాతీయ చట్టాల ప్రకారం వాటిని నిరంతరం తెరిచే ఉంచాలని కోరారు. ఏ పరిస్థితుల్లోనైనా వాణిజ్య నౌకలు, పౌర నౌకలపై దాడులు చేయకూడదని, సముద్రాల్లో ప్రయాణించే సిబ్బందిపై దాడి చేయడం సరికాదన్నారు.

## ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాల జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి : తలసాని శ్రీనివాస్ యాదవ్




హైదరాబాద్, జులై 25:ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాల జాతరకు అధికారులు పకడ్బందీ ఏర్పాటు చేయాలని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆదేశించారు. ఆగస్టు 2 న సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల జాతర నిర్వహణ, ఏర్పాట్లపై ఆలయం వద్ద వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆలయ పరిసరాలలో అధికారులతో కలిసి పర్యటించి ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు.

అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమ్మవారి దర్శనం కోసం, బోనాలు సమర్పించేందుకు వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు వస్తారని చెప్పారు. ప్రశాంత వాతావరణంలో జాతర నిర్వహణలో పోలీసులపాత్ర ప్రధానమైందని అన్నారు. శాంతి భద్రతల పర్యవేక్షణ కోసం అదనపు పోలీసు సిబ్బందిని నియమించాలని, అత్యాధునిక పరిజ్ఞానం కలిగిన సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు.జాతర జరిగే ఆగస్టు 2 న, ఫలహారం బండ్ల ఊరేగింపు జరిగే 3వ తేదీ సాయంత్రం పూర్తయ్యే వరకు ట్రాఫిక్ డైవర్షన్ కు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో సరైన వర్షాలు కురవడం లేదన్నారు. అమ్మవారి దీవెనలతో విస్తారంగా వర్షాలు కురవాలని, ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో ఆలయ ఈవో మనోహర్ రెడ్డి, లా అండ్ ఆర్డర్ ఏసీపీ శ్రీధర్, జోనల్ కమిషనర్ మంగ తాయారు, హెల్త్ ఆఫీసర్ వర్శిత, వివిధ శాఖల అధికారులు, డెక్కన్ మానవ సేవా సమితి, ఆర్య సమాజ్ సభ్యులు, ఆలయ కమిటీ మాజీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.మహంకాళి అమ్మవారి బోనాల జాతర సందర్భంగా అమ్మవారి కి సమర్పించనున్న చీర తయారీ పనులను ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆలయ ప్రాంగణంలో ప్రారంభించారు. చీర తయారు చేసే మగ్గానికి పూజలు నిర్వహించి పనులు ప్రారంభించారు.

## తీరిన ట్రాఫిక్ కష్టాలు

### -మర్రిగూడ జంక్షన్ వద్ద ఫ్లైఓవర్ ప్రారంభం



నల్గొండ, జులై 25:నల్లగొండ పట్టణ ప్రగతిలో మరో కీలక ముందడుగు.. వేస్తుందని రాష్ట్ర రోడ్లు భవనాలు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. నార్కట్‌పల్లి - అద్దంకి - మేదరమెట్ల రహదారిపై మర్రిగూడ జంక్షన్ వద్ద నూతనంగా నిర్మించిన ఫ్లైఓవర్‌ను మంత్రి లాంఛనంగా ప్రారంభించారు.ఈ ఫ్లైఓవర్ అందుబాటులోకి రావడంతో నల్లగొండ పట్టణవాసులతో పాటు, ఈ రహదారిపై నిత్యం ప్రయాణించే వేలాది మంది వాహనదారులకు ట్రాఫిక్ కష్టాలు తీరనున్నాయి.

అత్యంత రద్దీగా ఉండే మర్రిగూడ జంక్షన్‌లో రోడ్డు ప్రమాదాలను నివారించి, ప్రజలకు సురక్షితమైన అలాగే వేగవంతమైన ప్రయాణ అనుభవాన్ని అందించడానికి ఈ వంతెన ఎంతగానో ఉపయోగపడుతుంది.మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందనడానికి ఈ ప్రాజెక్టు ఒక ప్రత్యక్ష నిదర్శనం. రవాణా వ్యవస్థను మెరుగుపరచడం ద్వారా నల్లగొండ ప్రాంత ఆర్థిక మరియు వాణిజ్య వృద్ధికి ఈ నూతన ఫ్లైఓవర్ రహదారిని సుగమం చేస్తుంది. ఈ అభివృద్ధి కార్యక్రమం పట్ల ప్రాంతీయ ప్రజలు మరియు ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఘనంగా బీరన్న బోనాల జాతర

కరీమాబాద్, ఆంధ్రప్రభ : తొలి ఏకాదశి మహా పర్వదినమున వరంగల్ ఉర్సు శ్రీ బీరన్నస్వామి దేవాలయంలో ఉర్సు కురుమ కుల పెద్ద దేవాలయ చైర్మన్ మరుపల్ల రవి భాగ్యలక్ష్మి దంపతులు అభిషేకం నిర్వహించినారు. శనివారం ఉర్సు కుల పెద్ద అయిన మరుపల్ల రవి ఇంటి నుండి పట్టు వస్త్రాలు పూలదండలతో డోల్లతోబయల్దేరి పురవీధుల గుండా తిరుగుతూ దేవాలయమునకు చేరుకున్నారు.

దేవాలయంలో బీరన్న స్వామికి కామరాతికి అక్క మహంకాళికి పురోహితుడు బలబద్ర భాస్కర్ మంత్రోత్సవం గావించగా మరుపల్లరవి భాగ్యలక్ష్మి దంపతులు బీరన్న స్వామి కా మరాతి అక్క మహంకాళి దేవతలకు అభిషేకం నిర్వహించి దేవతలకు నూతన వస్త్రములు అలంకరించినారు. అభిషేక కార్యక్రమంలో కుల పెద్దలు మరుపల్ల రవి, కాళేశ్వర్ కుమారస్వామి, ఈశ్వర్ ప్రసాద్, కురుమ సంఘం నాయకులు ఏర కోటేశ్వర్, కోరే సాంబమూర్తి, మరుపల్లశివ, చీర భరత్, ధర్మకర్తలు మిరియాల కుమారస్వామి, మండల ప్రమీల ,మరుపల్ల గౌతం కొలుపుల కోటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి 25 విశ్రాంతి బెంచీల విరాళం..

### -రోగులు, సహాయకుల సౌకర్యార్థం సేవా కార్యక్రమం

కదిరి జులై 25: కదిరి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి సహాయకుల సౌకర్యార్థం సిమ్స్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్, ఎన్‌వైపీఎస్ఎన్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బి. నిసార్ యాసిన్ రూ.80 వేల విలువైన 25 విశ్రాంతి బెంచీలను విరాళంగా అందజేశారు.

ఆసుపత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హుస్సేన్, బి. నిసార్యా సిన్ సతీమణి డాక్టర్ ఆసియా, వైద్య బృందం సమక్షంలో బెంచీలను ప్రజల వినియోగానికి అందుబాటులో ఉంచారు. ఈ సందర్భంగా డాక్టర్ హుస్సేన్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి సహాయకులకు ఈ బెంచీలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు.

సామాజిక బాధ్యతతో ముందుకొచ్చి విరాళం అందించిన బి. నిసార్ యాసిన్, డాక్టర్ ఆసియాలను ఆయన అభినందించారు. డాక్టర్ ఆసియా మాట్లాడుతూ, ప్రజలకు అవసరమైన సమయంలో సేవ చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెందరికో స్ఫూర్తిగా నిలుస్తాయని అన్నారు. బి. నిసార్ యాసిన్ మాట్లాడుతూ, "ప్రజలకు అవసరమైన చోట సేవ చేయడం మా బాధ్యత. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి సహాయకులకు కొంతైనా ఉపశమనం కలిగించాలనే ఉద్దేశంతో ఈ విశ్రాంతి బెంచీలను అందించాం" అని తెలిపారు.

## విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి..

### -విజయవాడ డీవైఈవో డి.సాంబశివరావు

ఇబ్రహీంపట్నం, ఆంధ్రప్రభ : ప్రతి విద్యార్థి చదువుతో పాటు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని, అలాగే సమాజంలో జరుగుతున్న విషయాలపై అవగాహన కలిగి ఉండాలని విజయవాడ డీవైఈవో డి.సాంబశివరావు సూచించారు. గుంటుపల్లి డాన్ బోస్కో స్కూల్ కౌన్సిల్ ప్రమాణ స్వీకారోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. నూతనంగా ఎన్నికైన విద్యార్థి లీడర్స్ తో స్కూల్ యాజమాన్యం ప్రమాణ స్వీకారం చేయించారు. తొలుత జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా డీవైఈవో సాంబశివరావు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు విలువను విద్యార్థులకు తెలియజేయడం కోసం ఎన్నిక పక్రియను నిర్వహించటం అభినందనీయమన్నారు.

ఎన్నికల్లో ఒక్కరే గెలుస్తారు కానీ చదువులో అందరూ ప్రథమ స్థానంలో నిలిచే అవకాశం ఉందని, ఆ దిశగా ప్రతి విద్యార్థి చదువులి ఉన్నతంగా రాణించాలని సూచించారు. విద్యతోనే జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని అందుకు స్కూల్ స్థాయి నుంచే దృష్టి పెట్టాలని సూచించారు.

# అమ్మ జన్మనిస్తే నాన్న జన్మ పరమార్థాన్ని నూరి పోస్తాడు !

## (26 జూలై "జాతీయ తల్లిదండ్రుల దినోత్సవం" సందర్భంగా)

"మాతృదేవోభవ, పితృదేవోభవ" అంటున్నది హిందూ సమాజం. అమ్మ లేనిదే జన్మ లేదు. నాన్న లేనిదే లోక జ్ఞానం కలగదు. అమ్మ బుడిబుడి అడుగులు వేయిస్తే, నాన్న బిడ్డ చేయి పట్టి లోకాన్ని పరిచయం చేస్తాడు. అమ్మ నాన్నలే ఆది దేవతలు. శిశువుకు తొలి గురువు అమ్మ అయితే 2వ గురువుగా నాన్న నిలుస్తాడు. పిల్లల్ని కనడానికి ముందు నుంచే అమ్మ నాన్నలు సంతాన వృద్ధి కోసం తమ జీవితాలను అంకితం చేస్తారు. గర్భం దాల్చిన అమ్మ నవ మాసాలు కడుపులో బిడ్డను మోసి, పోషించి, ప్రసవ వేదనను అనుభవించి, బిడ్డను కని, తను పునర్జన్మను పొంది మురిసి పోతుంది. శిశు దశ నుంచి పెరిగే ప్రతి క్షణం నాన్న పాత్రతో పాటు త్యాగం అనన్యసామాన్యంగా ఉంటుంది. అమ్మనాన్నలకు పిల్లలే ప్రపంచం, వారి అభివృద్ధే ఆనందం, వారి నవ్వులే తమ అంతిమ లక్ష్యం అని మనకు తెలుసు. తల్లితండ్రులు అయ్యే వరకు అమ్మ నాన్నల పాత్ర మనకు పూర్తిగా అవగతం కాదు. నాన్న తొడిగింది అంగీ మాత్రమే కాదు, అదో కనిపించని రక్షణ కవచం. చేయి పట్టి నడక, నడత నేర్పిన నాన్న ప్రపంచాన్ని పరిచయం చేసిన జ్ఞాని. చంటివాడిని ముద్దుగా పైకి ఎగరేసిన నాన్న, తన కన్నా ఎత్తు ఎదగాలని ధైర్యం నూరి పోస్తాడు. మన కణ కణంలో నాన్న కదులుతూ ఉంటాడు. మన ప్రతి చర్య వెనుక నాన్న వేసిన పునాది కనిపిస్తుంది.

### జాతీయ తల్లిదండ్రుల దినోత్సవం:

నేటి డిజిటల్ యుగంలో పిల్లలకు, తల్లితండ్రులకు మధ్య ఏవో తెలియని తెరలు అడ్డుపడుతున్నాయి. తల్లితండ్రులు పిల్లలతో గడపడానికి విలువైన సమయమే సన్నపూసైంది. తల్లిదండ్రుల ప్రాధాన్యాన్ని గ్రహించి, వారితో జీవితకాలం చేతిలో చేయి వేసి నడవడం, పిల్లలతో తల్లిదండ్రుల సంబంధాలు బలపడడం, జీవిత చరమాంకంలో తల్లితండ్రులకు ఆసరాగా ఊతకర్ర వలె నిలవడం అనే లక్ష్యాలను దృష్టిలో పెట్టుకొని నాటి అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్ తీసుకున్న నిర్ణయం మేరకు ప్రతి ఏట నాలుగవ ఆదివారం, అనగా 26 జూలై 2026 రోజున "నేషనల్ పేరెంట్స్ డే" లేదా "జాతీయ తల్లితండ్రుల దినోత్సవం" పాటించడం 1995 నుంచి ఆనవాయితీగా మారింది. తల్లితండ్రులు పంచే బేషరతు ప్రేమ, పెంపకంలో చూపే ప్రత్యేక శ్రద్ధ, పిల్లల ఎదుగుదలలో చూపే అలుపెరుగని తపనలకు ప్రత్యామ్నాయం లేదు. పిల్లలు ఎదిగిన తర్వాత తమ తల్లితండ్రులను అక్కున చేర్చుకొని, ఊత కర్రగా మారి, వారి ఆయురారోగ్యాలకు మనస్ఫూర్తిగా దోహదపడాలి, అమ్మానాన్నల రుణం కొంతైనా తీర్చుకునే ప్రయత్నాలు చేయాలి.

### పేగు బంధం పరమ పవిత్రం:

తల్లి ప్రత్యక్ష పేగు బంధం పరమ పవిత్రం. తండ్రి తెర వెనుక త్యాగాలు పిల్లల ఎదుగుదలకు మూల స్థంభాలు. జాతీయ తల్లిదండ్రుల దినోత్సవం రోజున తమ జన్మ ప్రదాతలను తగు రీతిలో దైవ సమానంగా సన్మానించుకోవాలి. కుటుంబ పెద్దలుగా తల్లితండ్రులు తమ పిల్లలకు జీవితకాలం పాటు రక్షణ గొడుగులు. కుటుంబానికి ఇల్లు తండ్రి అయితే ఆ ఇంటి దర్వాజకు ఆకు పచ్చ తోరణం, గడపకు పసుపు పారాణి లాంటి శుభం అమ్మ అవుతుంది. 2026 జాతీయ తల్లితండ్రుల దినం వేదికగా ఎదిగిన పిల్లలకు తల్లితండ్రులను చూసుకునే బాధ్యతలను వివరించడం జరగాలి. తల్లితండ్రులు పిల్లలకు భావోద్వేగ మద్దతు, అవసర పోషణను అందించడం, ఉజ్వల భవితకు బాటలు వేయడం, లోక జ్ఞానాన్ని అందించడం, సంస్కారాలను నూరి పోయడం, క్రమశిక్షణ కల్పించగలగడం లాంటి ప్రధాన అంశాలపై దృష్టి పెడతారు. వృద్ధ తల్లిదండ్రులు పిల్లల నుండి ఆప్యాయతను మాత్రమే కోరుకుంటారని నేటి యువత తెలుసుకోవాలి.

పిల్లల శారీరక, మానసిక, సామాజిక, భావోద్వేగ, ఆధ్యాత్మిక అభివృద్ధికి అమ్మానాన్నలు హద్దులు లేని మద్దతు ఇస్తారు. పిల్లల కనీస అవసరాలను తీర్చడం, విద్యాబుద్ధులు నేర్పించడం, సంరక్షణ బాధ్యతలు తీసుకోవడం, నైతిక శిక్షణను ఇవ్వడం, ప్రోత్సాహ స్ఫూర్తిని అందించడం, వివిధ సమయాల్లో అవసర సహాయం చేయడం, అవ్యాజమైన ప్రేమ - అనంతమైన ఆప్యాయతలను పంచడం, మానవ సంబంధాలను ఏర్పరచడం లాంటి గురుతర బాధ్యతలను తల్లిదండ్రులు స్వచ్ఛందంగా, తమ జీవిత ఏకైక లక్ష్యంగా తీసుకుంటారు. అలాంటి అమ్మానాన్నలను ఎదిగిన పిల్లలు చక్కగా, గౌరవంగా, భాద్యతగా, ఆప్యాయంగా చూసుకోవడం, వారి త్యాగాలకు ధీటుగా పిల్లలు తిరిగి రుణం తీర్చుకోవడం కనీస కర్తవ్యం అని తెలుసుకొని మసలు కోవాలి.

అమ్మానాన్నలను ఆది దేవతలుగా భావించాలి, వారి రుణాన్ని కొంతైనా తీర్చుకునే విశ్వ ప్రయత్నం చేయాలి.

"హాపీ నేషనల్ పేరెంట్స్ డే" !



-మధుపాళీ
9949700037

# తొలి ఏకాదశి సందర్భంగా శ్రీ పశుపతినాథ్ దేవస్థానంలో విశేష పూజలు..

## -ఆలయ అర్చకులు సదానిరంజన్ సిద్ధాంతి ఆధ్వర్యంలో...




కరీంనగర్, జులై 25: హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలోని వల్లభాపురం గ్రామంలో వెలసిన శ్రీ పశుపతినాథ్ దేవస్థానంలో తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం అత్యంత వైభవంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తుల రాకతో ఆలయం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఈ సందర్భంగా స్వామివారికి పంచామృత రుద్రాభిషేకాలు, బిల్వార్చన, సామూహిక అర్చనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసి, ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు. ఆలయ అర్చకులు సదానిరంజన్ సిద్ధాంతి మాట్లాడుతూ, తొలి ఏకాదశి రోజున పరమశివుని ఆరాధించడం ద్వారా భక్తులకు ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, సుఖశాంతులు కలుగుతాయని తెలిపారు. ఈ పవిత్ర దినాన్ని పురస్కరించుకొని గ్రామస్తులు, పరిసర ప్రాంతాల భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ భావన ఋషి, కోడం రవేష్, దగ్గు వెంకటేశ్వరరావు, ఉడుత నరసన్న, ఆంధ్రప్రభ జర్నలిస్ట్ ప్రవీణ్, రాకేష్, మహేందర్, తరుణ్, ఠాగూర్, రంజాన్, శ్రీనివాస్, సుశాంత్, విజయ, మమత, సౌందర్య, పూజ, ఆద్విక, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీర్వాదాలు పొందారు. కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య విజయవంతంగా జరిగింది.

# లేడీ యాంప్తుల్ భోజనశాలకు రూ.3 లక్షల విరాళం..

మచిలీపట్నం, జులై 25, ఆంధ్రప్రభ : కృష్ణా జిల్లాలోని ఏకైక మహిళ ప్రభుత్వ జూనియర్ కళాశాల లేడి యాంప్తుల్ బాలికల జూనియర్ కళాశాలలో భోజన శాల నిర్మాణం నిమిత్తం కృష్ణా జిల్లా డీ.సీ.ఎం.ఎస్ చైర్మన్ మచిలీపట్నం జనసేన పార్టీ ఇంచార్జ్ బండి రామకృష్ణ డి సి ఎం ఎస్ నిధుల నుండి, కొంత స్వంత నిధులు నుండి కొంత మొత్తం రూ.3 లక్షల లేడి యాంప్తుల్ కళాశాలలో భోజన శాల నిర్మాణానికి మంజూరు చేశారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు, అధికారులు శంకుస్థాపన చేశారు.

ఎంతో కాలంగా భోజనశాల లేక ఎండలోనే భోజనాలు వండుతూ మహిళలు విద్యార్థినిలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గతంలో జరిగిన పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ లో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ నాయకులు కొనకళ్ళ బుల్లయ్య సూచన మేరకు స్పందించిన బండి రామకృష్ణ తక్షణమే నిధులను కేటాయించి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. సాధ్యమైనంత త్వరగా బిల్డింగ్ నిర్మాణం పూర్తి చేసి విద్యార్థినిలు అందిస్తామని బండి రామకృష్ణ తెలియజేశారు. ఈ సందర్భంగా బండి రామకృష్ణ మాట్లాడుతూ... లేడీ యాంప్తుల్ కళాశాల జిల్లాలో అగ్రస్థానంలో ఉందని విద్యా ప్రమాణాలు ఉన్నతంగా పెరిగాయని అదునపు తరగతి గదుల అవసరం ఎంతైనా ఉందని అందుకు ప్రభుత్వం నుండి ఎంపీ ఫండ్స్ నుంచి ప్రత్యేక నిధులు తీసుకొచ్చి నిర్మాణం చేస్తామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గొర్రెపాటి గోపీచంద్ కొనకల్ల బుల్లయ్య జనసేన పార్టీ ఇంచార్జ్ బండి రామకృష్ణ జనసేన పార్టీ నాయకులు కొట్టే వెంకట్రావు, గడ్డం రాజు, శివయ్య, పినిశెట్టి వేణు కొండ మేస్త్రి,చంటి, చిరంజీవి, రమేషు, గంపల కృష్ణ గంపల గంగాభవాని ఇంటర్మీడియట్ బోర్డు జిల్లా అధికారి సరళ కుమారి కళాశాల ప్రిన్సిపాల్ పి.లక్ష్మి ఎన్.ఎస్.ఎస్. అధికారి లంకిశెట్టి హరనాథ్ బాబు తదితరులు పాల్గొన్నారు.




# రసాయన పార్కుల కోసం 'భారత్ ఔద్యోగిక వికాస్ యోజన రసాయన్ (భవ్య రసాయన్)' పథకాన్ని ఆమోదించిన క్యాబినెట్

న్యూఢిల్లీ, జులై 25:దేశంలో మూడు ప్రత్యేక రసాయన పార్కులను ఏర్పాటు చేసేందుకు 'భారత్ ఔద్యోగిక వికాస్ యోజన రసాయన్ లేదా భవ్య రసాయన్' పథకానికి ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన నిర్వహించిన మంత్రి వర్గ సమావేశంలో ఆమోదించారు. ఆర్థిక సంవత్సరం 2026-27 కేంద్ర బడ్జెట్లో దీన్ని ప్రకటించారు.

ఈ పథకం మొత్తం ఆర్థిక వ్యయ అంచనా రూ.3,030 కోట్లు. దీనిలో రూ.3,000 కోట్లతో పార్కు లోపల ఉమ్మడి మౌలిక సదుపాయాలు, ప్రాథమిక సౌకర్యాలను ఏర్పాటు చేస్తారు. పరిపాలనా వ్యయం కోసం రూ. 30 కోట్లు కేటాయించారు. ఆర్థిక సంవత్సరం 2026?27 నుంచి ఆర్థిక సంవత్సరం 2030-31 వరకు అయిదేళ్ల పాటు ఈ పథకం కొనసాగుతుంది.

ఈ పథకం ద్వారా ప్రతి పార్కుకు రూ.1,000 కోట్ల వరకు నిధులను కేంద్రం మంజూరు చేస్తుంది. పార్కు ఏర్పాటు చేసే సంబంధిత రాష్ట్ర ప్రభుత్వం కనీసం రూ.500 కోట్ల వాటాను అందించాల్సి ఉంటుంది.

దిగువ పేర్కొన్న ప్రయోజనాలను భవ్య రసాయన్ పథకం అందిస్తుందని అంచనా వేస్తున్నారు:

ఇది రసాయన పరిశ్రమలోని ప్రాథమిక స్థాయి, తదుపరి ఉత్పత్తుల స్థాయి, అనుబంధ పరిశ్రమలతో సహా మొత్తం విలువ ఆధారిత వ్యవస్థ అభివృద్ధిని ప్రోత్సహిస్తుంది. అలాగే వనరులను సమర్థవంతంగా ఉపయోగించుకొనేలా చేస్తూ సరకు రవాణా ఖర్చులను తగ్గిస్తుంది.

రసాయన పరిశ్రమ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఏర్పాటు చేసే ఉమ్మడి మౌలిక వసతులు, ప్రాథమిక సేవలను పంచుకోవడం ద్వారా ఖర్చులు తగ్గుతాయి.

తద్వారా భారతీయ పరిశ్రమ ప్రపంచ మార్కెట్లో మెరుగైన పోటీ ఇస్తుంది.

ఇది అంతర్జాతీయ విలువ ఆధారిత వ్యవస్థల్లో భారతీయ రసాయన పరిశ్రమను మెరుగ్గా అనుసంధానించేందుకు దోహద పడుతుంది.

తద్వారా ఎగుమతు లను, దిగుమతి ప్రత్యామ్నాయా లను పెంచేందుకు దారి తీస్తు ంది.

ఉమ్మడి మురుగునీటి శుద్ధి కేంద్రం, వ్యర్థాల శుద్ధి, నిల్వ, పారవేత కేంద్రం, ప్రమా దకర మైన వ్యర్థాల నిర్వహణ మౌలిక వసతులు లాంటి కేంద్రీకృత సౌకర్యాలున్న పర్యావరణహిత వ్యవస్థను సృష్టిస్తుంది.

తద్వారా సుస్థిర విధానంలో భారతీయ రసాయన పరిశ్రమ అభివృద్ధిని ప్రోత్సహిస్తుంది.

# కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లోని 3 జిల్లాల్లో మల్టీట్రాకింగ్ ప్రాజెక్టుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం...

న్యూ ఢిల్లీ, జులై 25:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన ఆర్థిక వ్యవహారాల మంత్రివర్గ కమిటీ.. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని బళ్లారి-గుంతకల్ విభాగం మధ్య రూ. 1,264 కోట్ల అంచనా వ్యయంతో 3, 4వ రైల్వే లైన్ నిర్మాణానికి నేడు ఆమోదం తెలిపింది.

సమగ్ర ప్రణాళిక, భాగస్వాముల సంప్రదింపుల ద్వారా బహుళ రవాణా అనుసంధానాన్ని, లాజిస్టిక్ సామర్థ్యాన్ని పెంచే లక్ష్యంతో పీఎం-గతిశక్తి జాతీయ మాస్టర్ ప్లాన్ కింద ఈ ప్రాజెక్టును రూపొందించారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రజల రాకపోకలతో పాటు సరుకులు, సేవల రవాణాకు సులభతరమైన, ఆటంకాలు లేని అనుసంధానం అందుబాటులోకి రానుంది.

కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల పరిధిలోని 3 జిల్లాల మీదుగా సాగే ఈ ప్రాజెక్టు ద్వారా భారతీయ రైల్వే ప్రస్తుత వ్యవస్థ దాదాపు 46 కిలోమీటర్ల మేర పెరగనుంది.

ఈ ప్రతిపాదిత మల్టీ-ట్రాకింగ్ ప్రాజెక్టు వల్ల సుమారు ఏడు లక్షల జనాభా ఉన్న దాదాపు 99 గ్రామాలకు రవాణా సదుపాయాలు మెరుగుపడనున్నాయి.

రైల్వే సామర్థ్యం పెరగడం ద్వారా బళ్లారి కోట, శ్రీ కుమార స్వామి దేవాలయం వంటి దేశంలోని అనేక ప్రముఖ పర్యాటక ప్రాంతాలకు రైలు ప్రయాణం మరింత సులభతరం కానుంది.

ఈ ప్రతిపాదిత ప్రాజెక్టు ఇనుప ఖనిజం, డోలమైట్, సున్నపురాయి, ఇనుము, ఉక్కు, బొగ్గు, ఎరువులు, ఆహార ధాన్యాలు వంటి ప్రధాన సరుకుల రవాణాకు అత్యంత కీలకమైన మార్గం. రైల్వే సామర్థ్యం పెరగడం వల్ల ఏటా అదనంగా 16.22 మిలియన్ టన్నుల సరుకుల రవాణా సాధ్యమవుతుంది. రైల్వే రవాణా పర్యావరణహితమైనదే కాకుండా ఇంధన సామర్థ్యం కలిగినది కాబట్టి, ఇది దేశ వాతావరణ లక్ష్యాలను సాధించడంలో, రవాణా వ్యయాన్ని తగ్గించడంలో తోడ్పడుతుంది. దీనివల్ల 1.32 కోట్ల లీటర్ల మేరకు చమురు దిగుమతులు తగ్గడంతో పాటు 6.67 కోట్ల కిలోల కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాలు తగ్గుతాయి. ఇది 27 లక్షల మొక్కలను నాటడంతో సమానం.

లైన్ సామర్థ్యం పెరగడం వల్ల రైళ్ల రాకపోకల వేగం పెరిగి, భారతీయ రైల్వే పనితీరు మెరుగవడమే కాకుండా సేవల విశ్వసనీయత కూడా పెరుగుతుంది. ఈ మల్టీ-ట్రాకింగ్ ప్రతిపాదన రైల్వే కార్యకలాపాలను సులభతరం చేసి, ట్రాఫిక్ రద్దీని గణనీయంగా తగ్గిస్తుంది. ఈ ప్రాంత సమగ్ర అభివృద్ధి ద్వారా ప్రజలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరిగి, వారిని స్వయం సమృద్ధిగా తీర్చిదిద్దాలనే ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నవ భారత్ దార్శనికతకు అనుగుణంగా ఈ ప్రాజెక్టు నిలుస్తుంది.

# 27వ రోజుకు చేరిన కేటీపీఎస్ ఉద్యోగుల నిరసనలు

## వైటీపీఎస్ ఏహెచ్‌పీ, సీహెచ్‌పీ ప్రైవేటీకరణ నిర్ణయం ఉపసంహరించుకోవాలని డిమాండ్

కరీంనగర్, జులై 25:తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీఎస్‌పీఈజేఏసీ) పిలుపు మేరకు, రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (వైటీపీఎస్)లోని ఏహెచ్‌పీ (యాష్ హ్యాండ్లింగ్ ప్లాంట్), సీహెచ్‌పీ (కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్) విభాగాల ప్రైవేటీకరణ ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ కేటీపీఎస్‌లో ఉద్యోగుల నిరసనలు శుక్రవారం 27వ రోజుకు చేరుకున్నాయి.

ఈ సందర్భంగా అంబేడ్కర్ సెంటర్‌లో పెద్ద ఎత్తున ఉద్యోగులు నినాదాలు చేస్తూ నిరసన ప్రదర్శన నిర్వహించారు.

నిరసన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఇంజనీర్లు, ఉద్యోగులు, కార్మికులు, ఆర్టిసన్లు పాల్గొని ప్రభుత్వ ప్రైవేటీకరణ విధానాలను వ్యతిరేకించారు. విద్యుత్ రంగంలో ప్రైవేటీకరణ వల్ల ప్రజలపై అదనపు ఆర్థిక భారం పడటమే కాకుండా, ప్రభుత్వ రంగ విద్యుత్ సంస్థల సామర్థ్యం, భద్రత, ప్రజా ప్రయోజనాలు దెబ్బతినే ప్రమాదం ఉందని నాయకులు పేర్కొన్నారు.

ప్రజలకు నాణ్యమైన, విశ్వసనీయమైన, నిరంతరాయ విద్యుత్ సేవలు అందించాలంటే ప్రభుత్వ రంగ విద్యుత్ సంస్థలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లోని ఏహెచ్‌పీ, సీహెచ్‌పీ విభాగాల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని, ఉద్యోగుల ప్రయోజనాలు, సంస్థ భవిష్యత్తు, రాష్ట్ర విద్యుత్ రంగ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని డిమాండ్ చేశారు.

కేటీపీఎస్‌ను సందర్శించిన ఇంధన శాఖ కార్యదర్శి నవీన్ మిట్టల్, టీజెన్‌కో సీఎండీ హరీష్‌కు టీఎస్‌పీఈజేఏసీ నాయకులు వినతిపత్రం అందజేసి, వైటీపీఎస్ ఏహెచ్‌పీ, సీహెచ్‌పీ ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సమస్యలను వారికి వివరించారు. ఈ నిరసన కార్యక్రమంలో టీఎస్‌పీఈజేఏసీ చైర్మన్ రాజేందర్, కన్వీనర్ ఎస్.కె. యస్మీన్, సెక్రటరీ జనరల్ కరుణాకర్ రెడ్డి, జేఏసీ నాయకులు ఉమామహేశ్వరరావు, బ్రహ్మాజీ, మడకం శ్రీనివాసరావు, రాజేష్, ప్రభాకర్, అఖిల్, మధుబాబు, మహేష్, రఘువీర్, డోలి శ్రీనివాసరావు, రాధాకృష్ణ, కేశబోయిన కోటేశ్వర రావు, బ్రహ్మయ్య, వెంపటి వెంకటేశ్వర్లు, నరసింహారావు, సయ్యద్, సంపత్, చంద్ర కళాధర్, భాగ్యరాజు, పావని, రిజ్వానా, లక్ష్మి, వాహిని తదితరులు పాల్గొన్నారు.

# పేకాట స్థావరంపై పోలీసుల దాడి..



కరీంనగర్, జులై 25: పెద్దపల్లి మండలం అందుగులపల్లి గ్రామ శివారులోని ఎస్ఆర్ఎస్‌పీ కాలువ సమీపంలో పేకాట ఆడుతున్న స్థావరంపై పెద్దపల్లి రూరల్ పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకోగా, మరో ఇద్దరు పరారయ్యారు.

పెద్దపల్లి రూరల్ ఎస్ఐ మధుకర్ తన సిబ్బందితో కలిసి శుక్రవారం ఈ దాడి నిర్వహించారు. అరెస్టైన వారిలో రాణాపూర్‌కు చెందిన అంబటి తరుణ్ (33), కనగర్తికి చెందిన సార్ల అంజి (30), అందుగులపల్లికి చెందిన భూమ అనిల్ (29), బసంత్‌నగర్‌కు చెందిన గండికోట రాజేందర్ (29) ఉన్నారు.

బసంత్‌నగర్‌కు చెందిన సార్ల అశోక్, జీడీనగర్‌కు చెందిన తపళ్ల సతీష్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.13,500 నగదు, రెండు ద్విచక్ర వాహనాలు, నాలుగు సెల్‌ఫోన్లు, పేకాట పత్తాలను స్వాధీనం చేసుకున్నారు.

ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

# రోడ్డు భద్రతే లక్ష్యం..

## ఆర్టీసీలో రోడ్ సేఫ్టీ వీక్ ప్రారంభం

గుంటూరు జులై 25: రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా జూలై 25 నుంచి 31వ తేదీ వరకు జిల్లాలోని అన్ని ఆర్టీసీ డిపోలలో రోడ్ సేఫ్టీ వీక్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి (డీపీటీఓ) కుమారి జి.సామ్రాజ్యం తెలిపారు. రోడ్ సేఫ్టీ వీక్‌లో భాగంగా శనివారం గుంటూరులోని తిక్కన కాన్ఫరెన్స్ హాల్‌లో డీపీటీఓ సామ్రాజ్యం ఆధ్వర్యంలో ఆర్టీసీ డ్రైవర్లకు రహదారి భద్రత, సురక్షిత డ్రైవింగ్ విధానాలు, ప్రవర్తనా నైపుణ్యాలపై ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, వాహనాలను అప్రమత్తంగా నడపాలని సూచించారు. ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించడం, బాధ్యతాయుతమైన డ్రైవింగ్ అలవాట్లు అలవరచుకోవడం ద్వారా రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు.

# గుంటూరులో ఆధునికీకరించిన జన్ సేవా కనెక్ట్ పోస్టాఫీసులను ప్రారంభించిన కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్ పెమ్మసాని



న్యూఢిల్లీ, జులై 25:'జన్ సేవా కనెక్ట్' కార్యక్రమం కింద గుంటూరులో ఆధునికీకరించిన కొత్తపేట, చంద్రమౌళి నగర్ సబ్ పోస్టాఫీసులను కేంద్ర కమ్యూనికేషన్లు, గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్ పెమ్మసాని ఈ రోజు ప్రారంభించారు. తరువాతి తరం పౌర సేవా కేంద్రాలుగా ఈ పోస్టాఫీసులను ఆధునిక మౌలిక సదుపాయాలతో పాటు ఆంధ్రప్రదేశ్ సంస్కృతి, సాంప్రదాయాలు ఉట్టిపడేలా అభివృద్ధి చేశారు. ఇవి పోస్టల్, బ్యాంకింగ్, డిజిటల్, రవాణా సేవలను ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చి ప్రజలకు అందుబాటులో ఉంచుతాయి.

ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి డాక్టర్ చంద్రశేఖర్ పెమ్మసాని మాట్లాడుతూ... ఇండియా పోస్ట్ కేవలం ఉత్తరాలు అందించే ఒక శాఖ మాత్రమే కాదని, అది ప్రజల జీవితాలను అనుసంధానిస్తూ, సమాజాన్ని సాధికారత వైపు నడిపిస్తూ, భారత డిజిటల్, ఆర్థిక మార్పునకు ఊతమిచ్చే ఒక జాతీయ సంస్థ అని పేర్కొన్నారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో, కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి శ్రీ జ్యోతిరాదిత్య ఎం. సింధియా మార్గదర్శకత్వంలో తపాలా శాఖ తన 170 సంవత్సరాల చరిత్రలోనే అత్యంత సమగ్రమైన మార్పును సంతరించుకుంటోందని, ప్రపంచ స్థాయి బట్వాడా, ఈ-కామర్స్, ఆర్థిక సేవల వ్యవస్థగా అవతరిస్తోందని ఆయన వివరించారు.

తపాలా రంగంలో దేశంలోనే అతిపెద్ద సాంకేతిక ఆధునీకరణ కార్యక్రమాల్లో ఒకదాన్ని ప్రభుత్వం ప్రారంభించిందని కేంద్ర మంత్రి తెలిపారు. ఐటీ 2.0, అడ్వాన్స్‌డ్ పోస్టల్ టెక్నాలజీ (ఏపీటీ) 2.0 కింద రూ.5,785 కోట్ల పెట్టుబడితో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న 1.65 లక్షలకు పైగా తపాలా కార్యాలయాల నెట్‌వర్క్‌లో కృత్రిమ మేధస్సు (ఏఐ), క్లౌడ్ ఆధారిత వేదికలు, రియల్ టైమ్ డేటా వ్యవస్థలను అనుసంధానం చేస్తున్నట్లు తెలిపారు. వీటిలో దాదాపు 90 శాతం తపాలా కార్యాలయాలు గ్రామీణ ప్రాంతాలలోనే ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సాంకేతిక మార్పులతో సేవలు వేగంగా అందడమే కాకుండా, నిరంతర పర్యవేక్షణ, మెరుగైన నిర్వహణ సామర్థ్యం, వినియోగదారులకు మరింత సులభమైన, సమగ్ర సేవల అనుభవం అందుబాటులోకి వస్తుందని తెలిపారు.

భారత తపాలా శాఖ కూడా చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ (సీటీఓ), చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ (సీఎంఓ), వైస్ సీటీఓ వంటి వ్యూహాత్మక నాయకత్వ హోదాలను ప్రవేశపెట్టి కార్పొరేట్ తరహా పాలనా విధానాన్ని అవలంబించిందని డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. స్పష్టమైన వ్యాపార లక్ష్యాలు, నెలవారీ పనితీరు సమీక్షలు, జవాబుదారీతనంతో కూడిన వ్యవస్థలు, వినియోగదారుల అవసరాలకు ప్రాధాన్యత ఇచ్చే విధానంతో తపాలా శాఖ మరింత చురుకైన, పోటీ సామర్థ్యం కలిగిన, ప్రజలు, వ్యాపార సంస్థల మారుతున్న అవసరాలకు అనుగుణంగా స్పందించే సంస్థగా మారుతోందని పేర్కొన్నారు.

రవాణా రంగంలో వచ్చిన మార్పులను ప్రస్తావిస్తూ, భారత తపాలా శాఖ సవరించిన ధరల విధానం, పెద్ద మొత్తంలో పంపే వస్తువులకు చార్జీ రాయితీలు, 'బై నౌ పే లేటర్' (బీఎన్‌పీఎల్) సౌకర్యాలు, ప్రత్యేక ప్యాకేజింగ్ పరిష్కారాలు, జియో ట్యాగ్ చేసిన డెలివరీలు, ఎస్ఎంఎస్ ట్రాకింగ్, ఓటీపీ ఆధారిత డెలివరీ సదుపాయం, 24 నుంచి 48 గంటల లోపు బట్వాడా ప్రమాణాలను ప్రవేశపెట్టిందని మంత్రి తెలిపారు. ఓఎన్‌డీసీ, జెమ్, అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, పతంజలి వంటి సంస్థలతో పాటు డీహెచ్ఎల్ వంటి అంతర్జాతీయ రవాణా సంస్థలతో వ్యూహాత్మక భాగస్వామ్యాలు భారత ఈ-కామర్స్ వ్యవస్థ విస్తరణకు గణనీయంగా దోహదపడుతున్నాయని, రవాణా మార్కెట్‌లో భారత తపాలా శాఖ స్థానాన్ని మరింత బలోపేతం చేస్తున్నాయని పేర్కొన్నారు.

తపాలా కార్యాలయాలు ఇప్పుడు సమగ్ర పౌర సేవా కేంద్రాలుగా వేగంగా రూపాంతరం చెందుతున్నాయని ఆయన తెలిపారు. యూపీఐ చెల్లింపులు, ఆధార్ నమోదు, ఆధార్ వివరాల నవీకరణ సేవలు, పాస్‌పోర్ట్ సేవా సౌకర్యాలు, ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ డోర్‌స్టెప్ బ్యాంకింగ్, పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్, రూరల్ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్, ప్రభుత్వ పొదుపు పథకాలను తపాలా కార్యాలయాల ద్వారా అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం భారత తపాలా శాఖ 3.8 కోట్లకు పైగా సుకన్య సమృద్ధి యోజన ఖాతాలను నిర్వహిస్తోందని, తపాలా లావాదేవీలలో 60 శాతానికి పైగా ఇప్పుడు డిజిటల్ విధానంలోనే జరుగుతున్నాయని తెలిపారు. నగదు వినియోగం తగ్గిన, సాంకేతికత ఆధారిత వ్యవస్థ వైపు తపాలా శాఖ విజయవంతంగా మారుతోందనడానికి ఇది నిదర్శనమని పేర్కొన్నారు.

ఈ మార్పులో గ్రామీణ డాక్ సేవకులు (జీడీఎస్), పోస్ట్‌మెన్‌లు వెన్నెముక వంటి కీలక పాత్ర పోషిస్తున్నారని కేంద్ర మంత్రి తెలిపారు. జీడీఎస్ సమ్మేళనాలు, క్రమబద్ధమైన శిక్షణ కార్యక్రమాలు, విక్రయ నైపుణ్యాల అభివృద్ధి, డిజిటల్ సామర్థ్యాల పెంపు, ఫిర్యాదుల పర్యవేక్షణ, ప్రతిభను గుర్తించే విధానాలు, పనితీరు ఆధారిత జవాబుదారీతనం వంటి చర్యల ద్వారా గ్రామీణ భారతదేశంలో ఆర్థిక సమ్మిళితం, డిజిటల్ పాలనకు విశ్వసనీయ ప్రతినిధులుగా పనిచేసేలా భారత తపాలా శాఖ తన ముందువరుస సిబ్బందిని బలోపేతం చేస్తోందని పేర్కొన్నారు. పొదుపు, బీమా, ఆర్థిక ప్రణాళికపై కుటుంబాలకు అవగాహన కల్పించడంతో పాటు, ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంలో జీడీఎస్ ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నారని ఆయన తెలిపారు.

ఈ సంస్కరణలు ఇప్పటికే విశేష ఫలితాలను అందిస్తున్నాయని డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో ఇప్పటివరకు భారత తపాలా శాఖ అత్యధిక త్రైమాసిక ఆదాయాన్ని సాధించిందని, రూ.4,009 కోట్ల ఆదాయంతో ఏడాది ప్రాతిపదికన 22 శాతం వృద్ధిని నమోదు చేసిందని పేర్కొన్నారు. లావాదేవీలు లేని ఖాతాల సంఖ్య 90 శాతానికి పైగా తగ్గిందని, ఎఫెక్టివ్ కెపబిలిటీ రేషియో (ఈసీఆర్) 41 శాతం నుంచి 47 శాతానికి మెరుగుపడిందని తెలిపారు. ఇది తపాలా శాఖ కార్యకలాపాల సామర్థ్యంలో గణనీయమైన పురోగతిని ప్రతిబింబిస్తోందని పేర్కొన్నారు.

ఆంధ్రప్రదేశ్ పోస్టల్ సర్కిల్‌ను అభినందిస్తూ, 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో దేశంలోనే అత్యుత్తమ పనితీరు కనబరిచిన పోస్టల్ సర్కిల్‌గా ఆంధ్రప్రదేశ్ నిలిచిందని కేంద్ర మంత్రి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పోస్టల్ సర్కిల్ త్రైమాసిక వ్యాపార లక్ష్యంలో 102 శాతం సాధించి, రూ.233.7 కోట్ల ఆదాయాన్ని ఆర్జించిందని పేర్కొన్నారు.

మెయిల్ ఆపరేషన్స్‌లో దేశవ్యాప్తంగా మొదటి స్థానాన్ని సాధించడంతో పాటు, పార్సిల్ వ్యాపారంలో 140 శాతం వృద్ధిని నమోదు చేసిందని తెలిపారు. 'జయహో భీమా సంకల్ప్' బీమా ప్రచారం ద్వారా రూ.50 కోట్లకు పైగా ఆదాయాన్ని సాధించిందని వివరించారు. తల్లికి వందనం, దీపం, ఎన్‌టీఆర్ రైతు భరోసా, ఎన్‌టీఆర్ నగర్ వంటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన సంక్షేమ పథకాల కింద లబ్ధిదారులకు అందించే చెల్లింపుల్లో దాదాపు 33 శాతం తపాలా వ్యవస్థ ద్వారా జరుగుతున్నాయని, ఇది తపాలా శాఖకు ఉన్న అపూర్వమైన చివరి మైలు సేవల చేరువ సామర్థ్యాన్ని ప్రతిబింబిస్తోందని ఆయన పేర్కొన్నారు.

గుంటూరు ప్రాజెక్టుల గురించి ప్రస్తావిస్తూ, ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక గుర్తింపును ప్రతిబింబించేలా స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ మార్గదర్శకత్వంలో రెండు తపాలా కార్యాలయాలను కొత్తగా రూపకల్పన చేసినట్లు డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. రూ.51.81 లక్షల వ్యయంతో ఆధునికీకరించిన కొత్తపేట సబ్ పోస్టాఫీస్‌లో 1975లో విడుదలైన కూచిపూడి స్మారక తపాలా బిళ్ల స్ఫూర్తితో ప్రత్యేకమైన ఎరుపు రంగు ఫీచర్ వాల్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. రూ.64.13 లక్షల వ్యయంతో పునరుద్ధరించిన చంద్రమౌళి నగర్ సబ్ పోస్టాఫీస్‌ను తిరుమలలోని ప్రసిద్ధ ఆనంద నిలయం గోపురం నిర్మాణ శైలిని స్ఫూర్తిగా తీసుకుని రూపొందించినట్లు తెలిపారు.

జన్ సేవా కనెక్ట్ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేసిన ఆంధ్రప్రదేశ్ పోస్టల్ సర్కిల్, గుంటూరు డివిజన్ అధికారులు, సిబ్బందిని కేంద్ర మంత్రి అభినందించారు. వాతావరణ పరిస్థితులు, భౌగోళిక అడ్డంకులతో సంబంధం లేకుండా ప్రతి ఇంటికీ అవసరమైన సేవలను అందిస్తూ భారత తపాలా శాఖ విజయానికి నిజమైన స్ఫూర్తిగా నిలుస్తున్న పోస్ట్‌మెన్‌లు, గ్రామీణ డాక్ సేవకులను ప్రత్యేకంగా అభినందించారు. వారే భారత తపాలా శాఖ విజయానికి అసలైన హీరోలని ఆయన పేర్కొన్నారు.

వికసిత భారత్ కేవలం ప్రభుత్వ లక్ష్యం మాత్రమే కాదని, ఇది ప్రతి ఒక్కరి ఉమ్మడి జాతీయ బాధ్యత అని ప్రసంగాన్ని ముగిస్తూ డాక్టర్ చంద్రశేఖర్ స్పష్టం చేశారు. వేగవంతమైన, సాంకేతికత ఆధారిత, ప్రజా కేంద్రిత పాలనను అందించేందుకు కేంద్ర ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సన్నిహిత భాగస్వామ్యంతో కలిసి పనిచేస్తున్నాయని ఆయన పునరుద్ఘాటించారు. జన్ సేవా కనెక్ట్ కార్యక్రమం కింద ప్రతి తపాలా కార్యాలయం విశ్వసనీయ ప్రజా సంస్థగా రూపుదిద్దుకుంటుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. విద్యార్థులకు తోడ్పాటు అందించడం, వ్యాపారవేత్తలను ప్రోత్సహించడం, మహిళలకు సాధికారత కల్పించడం, వృద్ధులకు సహాయం చేయడం, సమాజాలను బలోపేతం చేయడం ద్వారా అభివృద్ధి చెందిన భారతదేశం లక్ష్య సాధన దిశగా తపాలా కార్యాలయాలు దేశాన్ని మరింత దగ్గర చేస్తాయని ఆయన పేర్కొన్నారు.



జూపాక సుభద్ర ఆత్మకథనమ్
గునుగుపూలు
పుస్తకావిష్కరణ
తేది: 27.07.2026 సోమవారం, సా॥6 గం.లకు
రవీంద్రభారతి మినీ కాన్ఫరెన్స్ హాల్, హైదరాబాద్
అధ్యక్షత :
డా. పసునూరి రవీందర్,
కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత
పుస్తకావిష్కర్త :
బెల్లంపల్లి దుర్గక్క
బెల్లంపల్లి పోలీసు కాల్పుల బాధిత.
తొలిప్రతి స్వీకర్త :
బాణాల సాలమ్మ
తెలంగాణ దక్కలి సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు
ఆత్మీయ అతిథులు :
డా. తాళ్లపల్లి యాకమ్మ, రచయిత్రి
డా. జిలుకర శ్రీనివాస్, సాహితీవేత్త
VCK పార్టీ రాష్ట్ర అధ్యక్షులు
డా. కోట విజయ,
ప్రిన్సిపాల్, మహిళా డిగ్రీ కళాశాల
డా. మారోజు దేవేంద్ర
చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం
దుర్గం రవీందర్, జర్నలిస్ట్
రచన ముద్రబోయిన,
ట్రాన్స్ జెండర్ నాయకురాలు
స్కై బాబా, ముస్లింవాద రచయిత
డా.సిద్దెంకి యాదగిరి, రచయిత
డా.పొన్నాల బాలయ్య, రచయిత
కృపాకర్ మాదిగ, రచయిత
రచయిత్రి స్పందన :
జూపాక సుభద్ర
అందరికీ ఆహ్వానం

## ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి..

ఖమ్మం, జులై 25:ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఎం పి సి,బై పి సి లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్స్‌పాల్ ముదాసిర్ హుసేన్ కోరారు.కళాశాలలో ఉన్న ఖాళీలను, తెలిపారు. మైనారిటీ కి10,మైనారిటీ కాని వారికి5సీట్లుకేటాయించినట్లు పేర్కొన్నారు.పరిమిత సంఖ్యలో మాత్రమే సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు.అనుభవజ్ఞులైన అధ్యాపకులు, నీట్ తదితర పోటీ పరీక్షలకు ప్రత్యేకశిక్షణఇస్తామన్నారు.ఉచిత వసతి భోజన సౌకర్యం, క్రమశిక్షణతో కూడిన విద్యా వాతావరణం ఆధునిక ప్రయోగశాలలు గ్రంథాలయంఅందుబాటులో ఉన్నాయన్నారు.పూర్తి వివరాలకు ప్రిన్సిపాల్ టి.జి.ఎం.ఆర్.జె.సి. యెల్లందు బాలుర కళాశాల 9666286874,9866401175 సంప్రదించాలని కోరారు.

## ప్రధాని వ్యాఖ్యలపై ఫిర్యాదు..

ఆదిలాబాద్, జులై 25: దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు, ఆయన అనుచరులపై శనివారం బాసర పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు సాయినాథ్ పటేల్, మాజీ జెడ్పీటీసీ పోగుల రాజేశ్వర్, శంకర్, సాయినాథ్, రమేష్ తదితరులు ఏఎస్ఐ శ్యాములకు ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దేశ ప్రధానిగా రెండు పర్యాయాలు సేవలందిస్తున్న నరేంద్ర మోదీపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని అన్నారు. బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కొత్తపల్లిలో రూ.10 లక్షలతో..వీబీ రామ్‌జీ నిధులతో అభివృద్ధి పనులు ప్రారంభం

### -నాణ్యతతో, గడువులోగా పనులు పూర్తి చేయాలని సర్పంచ్ ఆదేశం

కరీంనగర్, జులై 25: పెద్దపల్లి మండలం కొత్తపల్లి గ్రామంలో వీబీ రామ్‌జీ నిధుల నుంచి రూ.10 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను గ్రామ సర్పంచ్ పేర్క రిబ్కా సంతోష్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి మౌలిక వసతుల కల్పన అత్యంత ముఖ్యమని అన్నారు. సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయితే గ్రామ ప్రజలకు రాకపోకలు మరింత సౌకర్యవంతంగా మారడంతో పాటు రవాణా సమస్యలు తగ్గుతాయని తెలిపారు. పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సురేందర్‌రావు, ఉపసర్పంచ్ శ్రీనివాస్, వార్డు సభ్యులు పేర్క రాజేందర్, కలవేన సతీష్, సహకార సంఘం డైరెక్టర్ కలవేన సంపత్, ఫీల్డ్ అసిస్టెంట్ సుమలత, గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఎసన్వాయిలో పోలీసుల కార్డెన్ సెర్చ్



ఆదిలాబాద్, జులై 25:మంచిర్యాల జిల్లా ఎసన్వాయి గ్రామంలో శనివారం వేకువజామున కమ్యూనిటీ కాంటాక్ట్ లో భాగంగా పోలీసులు, ఎక్సైజ్ పోలీసులు ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. పోలీస్ ఎక్సైజ్ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దాడుల్లో సుమారు 1000 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి, 30లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్న అధికారులు తొమ్మిది పై కేసునమోదు చేసుకున్నారు. గ్రామంలో సరైన పత్రాలు లేని 35 వాహనాలను గుర్తించి సీజ్ చేశారు. ఈ సందర్భంగా జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజలలో భద్రతాభావాన్ని పెంపొందించడం, నేరస్తుల కదలికపై నిఘా ఉంచడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని అన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించిన ఆయన రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధన పాటించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం అతివేగంగా నిర్లక్ష్య చర్యలకు పాల్పడడం వల్ల కుటుంబాలు వీధిన పడుతున్నాయని ప్రజలకు అవగాహన కల్పించారు. తప్పనిసరిగా అన్ని రకాల పత్రాలు కలిగి ఉండాలని నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు మహిళల, చిన్నపిల్లల పట్ల అసభ్యంగా ప్రవర్తించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని ఏదైనా ఆపద కలిగితే వెంటనే స్థానిక పోలీసులకు లేదా డైల్ 100సమాచారం అందించి రక్షణ పొందాలని సూచించారు. ఈ తనిఖీలలో చెన్నూర్ రూరల్ సీఐ ఆర్ కృష్ణ, ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరిండెంట్ రామ్ రెడ్డి, సీఐ లు అక్బర్, కోటపెల్లి, నిల్వాయి ల ఎస్సైలు, పోలీసు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజల మన్ననలు పొందాలి

### -పోలీసులకు ఎస్పీ సూచన



కరీంనగర్, జులై 25: ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది క్రమశిక్షణ, నిబద్ధతతో విధులు నిర్వర్తిస్తూ ప్రజల మన్ననలు పొందేలా పనిచేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే సూచించారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలోని పరేడ్ మైదానంలో జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్, సివిల్, హోమ్‌గార్డ్ సిబ్బందికి నిర్వహించిన వారాంత పరేడ్‌కు హాజరైన ఆయన గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం సిబ్బంది నిర్వహించిన ఆర్మ్‌డ్ డ్రిల్, ఫుట్ డ్రిల్, లాఠీ డ్రిల్, ట్రాఫిక్ డ్రిల్‌లను పరిశీలించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు సిబ్బంది ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. ప్రతిరోజూ కనీసం అరగంట పాటు నడవడం, బయట ఆహారాన్ని వీలైనంత వరకు నివారించడం, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం అలవాటు చేసుకోవాలని చెప్పారు. వారాంత పరేడ్ ద్వారా క్రమశిక్షణ, ఐక్యత, శారీరక దారుఢ్యం పెంపొందుతాయని తెలిపారు.

క్రమశిక్షణతో విధులు నిర్వర్తిస్తూ పోలీసు శాఖకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించిన ఎస్పీ, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సిబ్బందికి ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా తనను కలిసి తెలియజేయవచ్చని చెప్పారు. ఈ పరేడ్‌లో అదనపు ఎస్పీ చంద్రయ్య, ఆర్ఐలు మధుకర్, సురేష్, రమేష్, ఆర్ఎస్ఐలు రాజు, శ్రవణ్ యాదవ్, దిలీప్, సాయికిరణ్‌తో పాటు ఆర్మ్‌డ్ రిజర్వ్, సివిల్, హోమ్‌గార్డ్ సిబ్బంది పాల్గొన్నారు.

# విపత్తుల ముప్పు తగ్గింపుపై మూడో బ్రిక్స్ మంత్రిత్వ స్థాయి సమావేశాన్ని విజయవంతంగా నిర్వహించిన భారత్

న్యూఢిల్లీ, జులై 25:భారత్ బ్రిక్స్ అధ్యక్షత - 2026లో భాగంగా కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు చెందిన జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ (ఎన్‌డీఎంఏ) 2026 జూలై 24న న్యూఢిల్లీలో విపత్తు ప్రమాదాల తగ్గింపు (డీఆర్ఆర్)పై మూడో బ్రిక్స్ మంత్రివర్గ సమావేశాన్ని విజయవంతంగా నిర్వహించింది. సమావేశానికి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి శ్రీ నిత్యానంద్ రాయ్ అధ్యక్షత వహించగా, బ్రిక్స్ సభ్య దేశాల మంత్రులు, ప్రతినిధి బృందాల అధిపతులు పాల్గొన్నారు. పరస్పర సహకారం, ఆవిష్కరణలు, సుస్థిర అభివృద్ధి ద్వారా విపత్తులను ఎదుర్కొనే సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేయాలన్న తమ ఉమ్మడి నిబద్ధతను వారు పునరుద్ఘాటించారు.

విపత్తు ప్రమాదాలను తగ్గించడంలో బ్రిక్స్ సహకారాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడానికి ఈ సమావేశం ప్రాతిపదికగా నిలిచింది. సమావేశం ముగింపులో విపత్తు ప్రమాదాల తగ్గింపుపై బ్రిక్స్ సంయుక్త ప్రకటనను ఏకగ్రీవంగా ఆమోదించారు. విపత్తు ప్రమాదాల తగ్గింపు కార్యాచరణ ప్రణాళిక (2025-2028) అమలును వేగవంతం చేయడంతో పాటు, విపత్తులను తట్టుకునేందుకు పరస్పర సహకారాన్ని మరింతగా బలోపేతం చేయాలన్న బ్రిక్స్ సభ్య దేశాల ఉమ్మడి నిబద్ధతను ఈ సంయుక్త ప్రకటన పునరుద్ఘాటించింది.

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి శ్రీ నిత్యానంద్ రాయ్ మాట్లాడుతూ ఉదయ్‌పూర్ డిక్లరేషన్ (2016) నుంచి కజాన్ డిక్లరేషన్ (2024) వరకు బ్రిక్స్ భాగస్వామ్యం ఎదిగిన తీరును వివరించారు. బ్రిక్స్ విపత్తు ప్రమాదాల తగ్గింపు బృందం (డీఆర్ఆర్‌జీ) ఏర్పాటు, సుస్థిరాభివృద్ధికీ, వాతావరణ మార్పులను తట్టుకునే సామర్థ్యానికీ, మానవ భద్రతకూ విపత్తు తీవ్రతను తగ్గించడం అత్యంత కీలకమనే అవగాహన క్రమంగా పెరుగుతోందని పేర్కొన్నారు. బ్రిక్స్ కు భారత అధ్యక్ష కాలంలో "స్థిరత్వం, ఆవిష్కరణలు, సహకారం, సుస్థిరత పెంపు" లక్ష్యంతో బ్రిక్స్ విపత్తు ప్రమాదాల తగ్గింపు బృందం (డీఆర్ఆర్‌జీ) ఆచరణాత్మక, కార్యాచరణ ఆధారిత విధానాన్ని అవలంబించిందని ఆయన తెలిపారు. డీఆర్ఆర్‌జీని మంత్రిత్వ స్థాయికి పెంచినందుకు బ్రెజిల్ దేశాన్ని ఆయన అభినందించారు.విపత్తు ముప్పుల తగ్గింపులో భారత నాయకత్వ ప్రాముఖ్యతను వివరిస్తూ, విపత్తు తీవ్రత తగ్గింపుపై ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రతిపాదించిన 10 అంశాల కార్యాచరణ ఆధారంగానే భారత ప్రజా కేంద్రిత ప్రజోపయోగ విధానం కొనసాగుతోందని కేంద్ర మంత్రి తెలిపారు. బ్రిక్స్ డీఆర్ఆర్ ప్రణాళిక (2025-2028) అమలును వేగవంతం చేసేందుకు భారత్ అధ్యక్షతన కేటాయించిన ఐదు వ్యూహాత్మక ప్రాధాన్యతలను ఆయన ఉదహరించారు. విపత్తు ప్రమాదాల తగ్గింపును సుస్థిరాభివృద్ధిలో అంతర్భాగం చేయడానికి శాస్త్ర సాంకేతిక రంగాలు, ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు, విపత్తులను తట్టుకునే మౌలిక సదుపాయాలు, ప్రకృతి ఆధారిత పరిష్కారాలు సమాజ స్థాయి ప్రతిఘటన సామర్థ్యం వంటి అంశాల్లో సభ్య దేశాలు తమ సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

సమావేశంలో భాగంగా వాతావరణ అనుకూల, విపత్తులను తట్టుకునే మౌలిక సదుపాయాల వ్యవస్థల అభివృద్ధి - సుస్థిరాభివృద్ధి కోసం భాగస్వామ్యాలు, ఆవిష్కరణలు, నిధుల సమీకరణ అనే అంశంపై ఒక ఉన్నత స్థాయి విధాన పరమైన చర్చ జరిగింది.

పెరుగుతున్న విపత్తులు, వాతావరణ మార్పుల సవాళ్లను ఎదుర్కొనేందుకు బలమైన మౌలిక సదుపాయాల అభివృద్ధి, నూతన ఆర్థిక వనరుల సమీకరణ, ఆధునిక సాంకేతికతలు, అంతర్జాతీయ భాగస్వామ్యాల సాధనపై ఈ సమావేశంలో మంత్రులు సుదీర్ఘంగా చర్చించారు. విపత్తు ముప్పుల తగ్గింపు కార్యాచరణ ప్రణాళిక (2025-2028) అమలును వేగవంతం చేయడంపై నిర్వహించిన బ్రిక్స్ మంత్రుల స్థాయి రౌండ్ టేబుల్ సమావేశం సభ్య దేశాలు తమ అనుభవాలను పంచుకోవడానికీ, వ్యవస్థాగత సహకారం, సామర్థ్య పెంపు, విజ్ఞాన మార్పిడి, అంగీకరించిన ప్రాధాన్యతల అమలును బలోపేతం చేయడానికి అవసరమైన ఆచరణాత్మక మార్గాలను గుర్తించడానికి దోహదపడింది. బ్రిక్స్ కు భారత్ అధ్యక్షత వహించిన సందర్భాన్ని పురస్కరించుకుని బ్రిక్స్ సభ్య దేశాల్లో విపత్తు తీవ్రత తగ్గింపు చర్యలను శాస్త్రీయ ఆధారాలతో రూపకల్పన చేయడానికీ, వ్యవస్థాగత బలోపేతానికీ, సామర్థ్య పెంపునకూ, ఆచరణాత్మక అమలుకూ తోడ్పడేలా ఆరు ప్రధాన వైజ్ఞానిక ఉత్పత్తులను ఆవిష్కరించారు. భవిష్యత్ కార్యాచరణలో భాగంగా విజ్ఞాన మార్పిడి, నూతన ఆవిష్కరణలు విపత్తు నిరోధకతలో స్పష్టమైన ఫలితాలను ప్రోత్సహించడం కోసం సాంకేతిక మార్పిడులు, ఉమ్మడి ప్రాజెక్టులు, నమూనా అభ్యాసాలు, నిపుణుల మార్పిడి, వార్షిక ఇతివృత్త ఆధారిత కార్యాచరణల ద్వారా ఆచరణాత్మక, ఫలితాల ఆధారిత సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని మంత్రులు పునరుద్ఘాటించారు.

విపత్తు ప్రమాదాల తగ్గింపుపై విజయవంతంగా ముగిసిన మూడో బ్రిక్స్ మంత్రిత్వ స్థాయి సమావేశం ద్వారా, విపత్తు ప్రమాదాల తగ్గింపులో అంతర్జాతీయ సహకారాన్ని మరింత బలోపేతం చేస్తూ విపత్తులను తట్టుకునే, సమ్మిళిత, సుస్థిర అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లాలన్న బ్రిక్స్ దేశాల ఉమ్మడి నిబద్ధత మరింత బలపడింది.

# హింస వల్ల బాధితులైన, ఆపదలో చిక్కుకున్న మహిళలకు ఒకే చోట అనేక విధాలైన, తక్షణ సాయాన్ని అందించే 'వన్ స్టాప్ సెంటర్' (ఓఎస్‌సీ)

న్యూఢిల్లీ, జులై 25:'మిషన్ శక్తి'లో భాగమైన సంబల్ కార్యక్రమంలో వన్ స్టాప్ సెంటర్ (ఓఎస్‌సీ) కూడా ఒక అంతర్భాగం. ఇది హింస వల్ల బాధితులైన మహిళలకు, ఆపదలో చిక్కుకున్న మహిళలకు ఒకే చోట అనేక విధాల సహాయాన్ని, తక్షణ సహాయాన్ని అందిస్తుంది. ఇప్పటి వరకు, దేశవ్యాప్తంగా 1,033 వన్ స్టాప్ సెంటర్ల (ఓఎస్‌సీస్)ను ఏర్పాటు చేయడానికి మార్గాన్ని సుగమం చేయగా, వీటిలో 985 వన్ స్టాప్ సెంటర్లు పనిచేసున్నాయి. 2015 ఏప్రిల్ 1 నుంచి 2026 జూన్ 30 మధ్య కాలంలో దేశంలో 15 లక్షల ఇరవై వేలకు పైగా మహిళలకు ఈ సెంటర్లు సాయపడ్డాయి. ప్రతి ఓఎస్‌సీలో ఒక సెంటర్ అడ్మినిస్ట్రేటర్, ఇద్దరు కేస్ వర్కర్లు, ఒక సైకో–సోషల్ కౌన్సెలర్, ఒక పారా లీగల్ పర్సనెల్, లేదా న్యాయవాది, ఒక పారా మెడికల్ పర్సనెల్ సహా 13 మందిని నియమించడానికి రాష్ట్రాలకూ, కేంద్రపాలిత ప్రాంతాలకూ కేంద్ర ప్రభుత్వమే 100 శాతం ఆర్థిక సహాయాన్ని అందిస్తోంది. ఇందులో స్థానిక అవసరాలు, నిర్వహణ సాధ్యాసాధ్యాల ఆధారంగా సిబ్బంది కూర్పును సరళతరం చేశారు కూడా. ఓఎస్‌సీ పథకం అమలు బాధ్యత మాత్రం రాష్ట్ర ప్రభుత్వాలకు, కేంద్రపాలిత ప్రాంతాల పాలన యంత్రాంగాలకు అప్పగించారు.

సమన్వయాన్ని పటిష్ఠపరిచి, సహాయ సంబంధిత సేవలను నిరంతరాయంగా అందేటట్లు చూడడానికి ఓఎస్‌సీలను మహిళా హెల్ప్‌లైన్ (డబ్ల్యూహెచ్ఎల్)తో అనుసంధానించారు. ఇంతవరకు 657 ఓఎస్‌సీలను కలిపారు. ఈ ఏకీకరణతో, మహిళలకు సమయానికి తగ్గట్లు అవసరమైన సేవలు అందేటట్లు చూస్తారు. అంతేకాక, అత్యవసర ప్రతిస్పందన మద్దతు వ్యవస్థ (ఈఆర్ఎస్ఎస్–112), చైల్డ్ హెల్ప్‌లైన్ (1098), ఇతరత్రా సేవలను అందించే వ్యవస్థలతో కూడా అనుసంధానించారు. అలాగే దీర్ఘకాలిక సంస్థాగత సహాయం, పునరావాసం, సురక్షిత ఆశ్రయం అవసరపడే మహిళలను పంపించడంలో వెసులుబాటు కోసం ఓఎస్‌సీలను 'శక్తి సదన్'తో కూడా జతపరిచారు. ఇది మిషన్ శక్తి ఫ్రేంవర్కులో భాగంగా నిరంతర ప్రాతిపదికన సంరక్షణ అవకాశాన్ని అందిస్తోంది.

'మిషన్ శక్తి'లో భాగంగా, ఇదివరకటి 'స్వధార్ గృహం'–(కఠిన పరిస్థితులకు లోనైన మహిళలకు ఉద్దేశించిన ఇల్లు) పథకాన్నీ, 'ఉజ్జ్వలా' (చట్టం కళ్లుగప్పి మనుషులను తరలిస్తుండగా ఆ దుష్టకృత్యం నుంచి రక్షించిన మహిళలకు ఉద్దేశించిన ఇల్లు) పథకాన్ని విలీనం చేశారు. ఇవి ప్రస్తుతం 'శక్తి సదన్ పథకం' పేరుతో చెలామణీ అవుతున్నాయి. ఆపత్కర పరిస్థితుల్లో చిక్కుకున్న మహిళలకు (వీరిలో మనుషుల దొంగచాటు తరలింపు ఘటనలలో బాధితులైన మహిళలు కూడా ఉన్నారు) ఉద్దేశించిన ఏకీకృత సహాయ, పునరావాస కేంద్రమే 'శక్తి సదన్'. కఠిన పరిస్థితులను ఎదుర్కొన్న మహిళలకు వారు ప్రతికూల పరిస్థితుల నుంచి గట్టెక్కేటట్లు సురక్షిత, సహాయపూర్వక వాతావరణాన్ని వారికి కల్పిం చడం శక్తి సదన్ లక్ష్యం.

'శక్తి సదన్'లో నివాసం ఉండే వారికి ఆశ్రయం, భోజనం, వస్త్రాలు, సంప్రదింపు సేవలు, ప్రాథమిక ఆరోగ్య సదుపాయాలతో పాటు ఇతరత్రా వెసులుబాటులను కల్పిస్తారు. నివాసులకు సంబంధిత విభాగాల సమన్వయంతో వృత్తిపరమైన శిక్షణ, బ్యాంకు ఖాతాలను తెరవడం, సామాజిక భద్రత ప్రయోజనాల వంటి ప్రయోజనాలను అందిస్తారు. దీనికి తోడు కార్యాచరణ సంస్థ ద్వారా కార్మిక, ఉపాధి శాఖ అధీనంలోని ఉపాధి, శిక్షణ డైరెక్టరేట్ గుర్తింపు పొందిన వృత్తి సంబంధిత శిక్షణ సంస్థలు, జాతీయ నైపుణ్యాభివృద్ధి మండలి (ఎన్ఎస్‌డీసీ) కి చెందిన శిక్షణ భాగస్వాములతో మహిళలకు వృత్తి శిక్షణ, నైపుణ్యాభివృద్ధి తరగతుల నిర్వహణకు ఏర్పాట్లను చేస్తారు. శిక్షణను, పరీక్ష రుసుమును కేంద్ర ప్రభుత్వం, లేదా రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలోని మరే పథకం గాని, లేదా కార్యక్రమంలో భాగంగా గాని అందించని పక్షంలో, శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన తరువాత వృత్తి సంబంధ శిక్షణ సంస్థ ఇచ్చే ధ్రువపత్రాన్ని దాఖలు చేస్తే, రుసుమును తిరిగి ఇస్తారు. ఒకవేళ నివాసులు చిన్న తరహా పరిశ్రమను మొదలుపెట్టాలని కోరుకుంటే, ఎస్ఐడీబీఐ, ముద్రా, కేంద్ర ప్రభుత్వం లేదా రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన ఇతర సంబంధిత పథకాల ద్వారా సూక్ష్మ రుణ సదుపాయాన్ని అందిస్తారు. దీనికి తోడు, మిషన్ శక్తిలో భాగంగా 'సఖి నివాస్ పథకం' (పనిచేస్తున్న మహిళల వసతిగృహం) కూడా ఉంది. పట్టణ ప్రాంతాలు, సెమీ అర్బన్ ప్రాంతాలు, గ్రామీణ ప్రాంతాలలో పనిచేస్తున్న మహిళలకు సురక్షిత, సౌకర్యవంత నివాసాలు అందుబాటులో ఉండేటట్లు ప్రోత్సహించడం ఈ పథకం ఉద్దేశం. ఈ సమాచారాన్ని మహిళలు, శిశు సంక్షేమ శాఖ సహాయ మంత్రి శ్రీమతి సావిత్రీ ఠాకుర్ లోక్‌సభలో ఒక ప్రశ్నకు ఇచ్చిన సమాధానంలో తెలిపారు.

# దేశంలో 386 ప్రైవేటు ఎఫ్ఎం రేడియో ఛానెళ్లు

న్యూఢిల్లీ, జులై 25:గత ఏడాది జులై 9, 10 తేదీల్లో పారదర్శకమైన విధానం ద్వారా 234 కొత్త నగరాల్లో 730 ఎఫ్ఎం ఛానెళ్లకు ఈ-వేలం నిర్వహించింది. వేలానికి ముందు ఈ విషయంపై పత్రికా, ఎలక్ట్రానిక్ మీడియాలో విస్తృత ప్రచారం కల్పించారు. ఈ వేలంలో మొత్తం 18 బిడ్డర్లు విజయం సాధించగా, అందులో 9 సంస్థలు ప్రైవేటు ఎఫ్ఎం రంగానికి కొత్తగా పరిచయమైనవే కావడం విశేషం. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 386 ప్రైవేటు ఎఫ్ఎం రేడియో ఛానెళ్లు పనిచేస్తున్నాయి

ప్రైవేటు ఎఫ్ఎం రేడియో విధానం ప్రకారం ప్రతి ప్రసార సంస్థ తమ రోజువారీ ప్రసారాల్లో కనీసం 20 శాతం కంటెంట్‌ను తప్పనిసరిగా స్థానిక భాషలోనే ఉండేలా చూసుకోవాలి. ప్రాంతీయ సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలు, జానపద సంగీతాన్ని పెంపొందించేందుకు, స్థానిక కళాకారులను ప్రోత్సహించేందుకు ఈ నిబంధనను ప్రభుత్వం తీసుకువచ్చింది.

ప్రైవేటు ఎఫ్ఎం రేడియో ఫేజ్–3 విధానం ప్రకారం ప్రసారాలను దేశమంతటా వేగంగా అందుబాటులోకి తెచ్చేందుకు వీలుగా ప్రైవేటు ప్రసార సంస్థలు అందుబాటులో ఉన్న ప్రసార భారతి టవర్లు, ప్రాంగణాలను వినియోగించుకోవడానికి ప్రభుత్వం అనుమతినిచ్చింది. ముఖ్యంగా మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలు, ఆకాంక్షిత జిల్లాల్లో ఎఫ్ఎం సేవలు త్వరితగతిన ప్రారంభమయ్యేలా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ఇందుకోసం కచ్చితమైన సమయ పరిమితులతో అంగీకార పత్రం (ఎల్ఓఐ) జారీ చేయడంతో పాటు అనుమతి మంజూరు ఒప్పందాన్ని (జీఓపీఏ) అమలు చేస్తోంది.

ప్రజా సంక్షేమ ప్రకటనలు, ప్రభుత్వ పథకాలకు సంబంధించిన సమాచారం ప్రజలకు సరిగా చేరుతోందో లేదో తెలుసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం బహుముఖ వ్యూహాన్ని అనుసరిస్తోంది. ఇందులో భాగంగా ప్రసార మాధ్యమాల్లో వస్తున్న ప్రకటనలను ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తోంది. అత్యవసర పరిస్థితులు, కీలక ప్రచారాల సమయంలో ధ్రువీకరించిన సమాచారాన్ని సకాలంలో ప్రజలకు చేరవేసేందుకు, ప్రసార సంస్థలతో ప్రభుత్వం సన్నిహిత సమన్వయాన్ని కొనసాగిస్తోంది.

ఈ వివరాలను రాజ్యసభ సభ్యుడు శ్రీ ఐఎస్ ఇన్బదురై అడిగిన ఓ ప్రశ్నకు సమాధానంగా కేంద్ర సమాచార, ప్రసార, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్ మురుగన్ లిఖితపూర్వక సమాధానంలో వెల్లడించారు.

# ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట..

## –జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



నల్గొండ, జులై 25:ప్రభుత్వ పాఠశాలలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తున్నాయని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కోహెన్స్ సీఎస్ఆర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డిజిటల్ కంప్యూటర్ ల్యాబ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని తెలిపారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు డిజిటల్ విద్య, నైపుణ్యాభివృద్ధి కూడా ఎంతో అవసరమని అన్నారు. భవిష్యత్తులో పోటీ ప్రపంచానికి తగిన విధంగా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు జిల్లా యంత్రాంగం, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు సమిష్టిగా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల అంకితభావం వల్ల ఈ విద్యా సంవత్సరంలో ఒక్క ఈ పాఠశాలలోనే 120 మంది కొత్త విద్యార్థులు చేరగా, జిల్లా వ్యాప్తం గా సుమారు 10 వేల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరారని తెలిపారు.

త్వరలో ప్రభుత్వ పాఠశాలల్లో బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని కూడా అమలు చేయనున్నట్లు వెల్లడించారు. విద్యార్థులు పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, బయట ఆహారం తినకుండా ఇంటి భోజనం లేదా పాఠశాలలో అందించే పోషకాహారాన్ని తీసుకోవాలని సూచించారు. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉండటంతో పాటు చదువులోనూ రాణించగలరని అన్నారు. ఈ సందర్భంగా విద్యాశాఖ నిధుల నుంచి పాఠశాల అభివృద్ధికి రూ.10 లక్షలు కేటాయిస్తున్నట్లు కలెక్టర్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో డీఈవో అశోక్, తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెలుగు వెంకన్న, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గోలి పద్మ,ఎంఈవో శేషగాని శ్రీనివాస్, కోహెన్స్ ప్రతినిధులు వెంకటరమణ, దుస్సా సైదులు, వలి, రామకృష్ణ, ఉపాధ్యాయులు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వనమహోత్సవం

## –జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహణ



నల్గొండ, జులై 25:జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలో శనివారం వనమహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, జిల్లా ఎస్పీ నరసింహ ముఖ్య అతిథులుగా హాజరై మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఒకేసారి 1,500 మొక్కలను నాటారు.

కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ చెట్ల పెంపకం పర్యావరణ పరిరక్షణకు, వర్షపాతం పెరుగుదలకు దోహదపడుతుందని అన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని మహావృక్షాలుగా ఎదిగేలా సంరక్షించాలని పిలుపునిచ్చారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు సామాజిక బాధ్యతగా పోలీసులు పెద్ద ఎత్తున మొక్కలు నాటడం అభినందనీయమన్నారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గుతున్న నేపథ్యంలో రైతులు తక్కువ నీటితో పండే పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. జిల్లా పోలీసు శాఖ ఇతర శాఖలతో సమన్వయం చేసుకుంటూ ప్రజా అవగాహన కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తోందని, పోలీసు సిబ్బంది సంక్షేమం కోసం పోలీసు క్యాంటీన్, పరేడ్ గ్రౌండ్, జిమ్ వంటి సౌకర్యాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

జిల్లా ఎస్పీ నరసింహ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా నిర్వహిస్తున్న వనమహోత్సవంలో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయంతో పాటు అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో కూడా మొక్కలు నాటుతున్నామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు చెట్ల పెంపకం ఎంతో అవసరమని, వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు తక్కువ నీరు అవసరమయ్యే పంటలను సాగు చేయాలని సూచించారు. ఈ విషయంపై పోలీసు శాఖ రైతులకు అవగాహన కల్పిస్తోందని చెప్పారు.

ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ అధికారి మంజు భార్గవి, డీఎస్పీలు ప్రసన్న కుమార్, రవి, నరసింహాచారి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ మగ్దూం అలీ, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు ప్రవీణ్ కుమార్, జానయ్య, సీఐలు రాజశేఖర్, వెంకటయ్య, ఆర్ఎస్ఐలు సురేష్, ఎం. అశోక్, సాయిరాం, రాజశేఖర్, కె. అశోక్, అన్వర్, అఖిల్, ఎస్ఐలు యాదవేందర్, మహేష్, మౌనికతో పాటు పెద్ద సంఖ్యలో పోలీసు సిబ్బంది పాల్గొని మొక్కలు నాటారు.

# ఒక్క ఓటు కూడా పోనియొద్దు

## –ప్రతి బూత్‌లో ఓటరు జాబితాను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచన



నిజామాబాద్, జులై 25: ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఒక్క ఓటు కూడా కోల్పోకుండా పార్టీ నాయకులు అప్రమత్తంగా వ్యవహరించాలని కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ సూచించారు. శనివారం బిక్కనూర్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించి గ్రామాల వారీగా ఓటరు జాబితా సవరణ పురోగతిని సమీక్షించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి బూత్‌లో అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా పార్టీ నాయకులు ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. బూత్‌ల వారీగా ఓటర్ల వివరాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, అర్హులైన వారందరూ దరఖాస్తు ఫారాలను నింపి అధికారులకు అందజేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఓటరు జాబితాలో అవకతవకలు, అనర్హ ఓట్లు లేకుండా పర్యవేక్షించడం కూడా పార్టీ నాయకుల బాధ్యత అని పేర్కొన్నారు.

ఈ సమావేశంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, రామేశ్వరపల్లి సొసైటీ అధ్యక్షుడు భూమ్‌రెడ్డి, పాలకేంద్రం అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ యువజన విభాగం మండల అధ్యక్షుడు రంజిత్ వర్మ, సిద్ధిరామేశ్వర ఆలయ కమిటీ మాజీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, మండల రైతు సమన్వయ కమిటీ మాజీ కన్వీనర్ రామచంద్రంతో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పశ్చిమాసియా భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో ఎరువుల సరఫరాను పరిరక్షించేందుకు ప్రభుత్వం సమగ్ర చర్యలు

న్యూ ఢిల్లీ, జులై 25:పశ్చిమాసియాలో చెలరేగిన భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల వల్ల ఏర్పడిన అవాంతరాలను తట్టుకుని దేశంలో ఎరువుల సరఫరా వ్యవస్థను పరిరక్షించడంతో పాటు రైతులకు ఎరువుల కొరత లేకుండా చూసేందుకు కేంద్ర ప్రభుత్వం సమగ్ర చర్యలు చేపట్టింది. 2025–26 కాలంలో తలెత్తిన ఈ ప్రతికూల పరిస్థితులు ఎరువులు, కీలక ముడి సరుకుల అంతర్జాతీయ సరఫరా వ్యవస్థలపై తీవ్ర ప్రభావం చూపాయి. దీనివల్ల నౌకా రవాణా, బీమా వ్యయాలు పెరగడమే కాకుండా, రవాణాలో జాప్యం, ధరల్లో హెచ్చుతగ్గులు ఏర్పడ్డాయి. ముఖ్యంగా భారత దిగుమతి చేసుకునే అమ్మోనియా, ఫాస్పారిక్ ఆమ్లం, సల్ఫర్‌ల సరఫరాపై ఈ ప్రభావం పడింది. అంతర్జాతీయ లాజిస్టిక్స్ సమస్యల కారణంగా పొటాష్ దిగుమతి వ్యయం కూడా పెరిగింది. ఈ సవాళ్లు ఎదురైనప్పటికీ, ప్రభుత్వం విదేశాల నుంచి ఎరువుల కొనుగోళ్లను వేర్వేరు మార్గాలకు విస్తరించడం, ఎప్పటికప్పుడు సకాలంలో జోక్యం చేసుకోవడం ద్వారా దేశంలో ఎరువుల లభ్యత తగినంతగా ఉండేలా చూసింది.

ప్రతి పంట కాలంలో సరైన సమయానికి, తగినంత ప్రమాణంలో ఎరువులు అందుబాటులో ఉండేలా చూసేందుకు ప్రభుత్వం ఒక పటిష్టమైన వ్యవస్థను అమలు చేస్తూనే ఉంది. ప్రతి సీజన్ ప్రారంభానికి ముందే వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదించి రాష్ట్రాల వారీగా, నెలల వారీగా ఎరువుల అవసరాలను అంచనా వేస్తుంది. ఈ అంచనాల ఆధారంగా, ఎరువుల శాఖ నెలవారీ సరఫరా ప్రణాళికలను విడుదల చేయడంతో పాటు సమీకృత ఎరువుల నిర్వహణ వ్యవస్థ ద్వారా ఎరువుల రవాణాను నిరంతరం పర్యవేక్షిస్తుంది. లభ్యతను సమీక్షించి, అవసరమైన చోట దిద్దుబాటు చర్యలు చేపట్టేందుకు రాష్ట్ర వ్యవసాయ అధికారులతో క్రమం తప్పకుండా వారానికోసారి వీడియో కాన్ఫరెన్సులను నిర్వహిస్తుంది. ఇక రాష్ట్రాల పరిధిలో ఎరువుల పంపిణీ బాధ్యతను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలే చూసుకుంటాయి.

ఈ చర్యల ఫలితంగా 2025–26 ఆర్థిక సంవత్సరంతో పాటు ప్రస్తుతం కొనసాగుతున్న 2026 ఖరీఫ్ సీజన్‌లో కూడా దేశవ్యాప్తంగా యూరియా, డీఏపీ, ఎంఓపీ, ఎన్‌పీకేఎస్ ఎరువుల లభ్యత తగినంతగా అందుబాటులో ఉంది. ఎరువుల అవసరం, లభ్యత, విక్రయాలు, మిగిలిన నిల్వల వివరణాత్మక సమాచారం కింది విధంగా ఉంది.

ఫాస్ఫేటిక్, పొటాషిక్ ఎరువులకు సంబంధించి ప్రభుత్వం 01.04.2010 నుంచి పోషకాహార ఆధారిత రాయితీ (ఎన్‌బీఎస్) పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం ద్వారా ఫాస్ఫేటిక్, పొటాషిక్ ఎరువులు ఓపెన్ జనరల్ లైసెన్స్ (ఓజీఎల్) పరిధిలోకి వస్తాయి.

కంపెనీలు తమ వ్యాపార అవసరాలకు అనుగుణంగా ఈ ఎరువులను దిగుమతి చేసుకోవడానికి లేదా తయారీ చేయడానికి పూర్తి స్వేచ్ఛ కలిగి ఉంటాయి. ఇది తగినంత సరఫరాలను నిర్వహించడానికి వీలు కల్పిస్తుంది.

పశ్చిమాసియాలో కొనసాగుతున్న సంఘర్షణల కారణంగా పారిశ్రామిక రసాయనాలు, ఔషధ తయారీలో ఉపయోగించే ముడిసరుకుల సరఫరా వ్యవస్థలో కొన్ని ప్రమాదాలు తలెత్తుతున్నాయని ప్రభుత్వం గుర్తించింది. దీనివల్ల ఐసోప్రొపైల్ ఆల్కహాల్ (ఐపీఏ), అమ్మోనియా, మిథనాల్ వంటి ముడి పదార్థాల తాత్కాలిక కొరత ఏర్పడటంతో పాటు వాటి ధరలు పెరిగాయి. ఈ ప్రమాదాలను

# మెరుగైన పోషకాహారం, ఈసీసీఈ కార్యకలాపాల కోసం 2 లక్షల అంగన్‌వాడీ కేంద్రాలను సక్షమ్ అంగన్‌వాడీలుగా అప్‌గ్రేడ్ చేసేందుకు ఆమోదం

న్యూఢిల్లీ, జులై 25:దేశంలో పోషకాహార లోపం సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అంగన్‌వాడీ సేవలు, పోషణ్ అభియాన్, కౌమార బాలికల కోసం ఉద్దేశించిన పథకాలను "మిషన్ సక్షమ్ అంగన్‌వాడీ, పోషణ్ 2.0 (మిషన్ పోషణ్ 2.0)" అనే ప్రధాన వ్యవస్థ కిందకు తీసుకొచ్చింది. ఇది కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్వహించే పథకం. ఇందులోని వివిధ కార్యక్రమాలను క్షేత్ర స్థాయిలో అమలు చేసే బాధ్యత పూర్తిగా ఆయా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలపై ఉంటుంది. ఈ మిషన్‌ను దేశవ్యాప్తంగా ఉన్న అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలతో పాటు తీవ్ర ప్రభావం ఉన్న జిల్లాల్లో కూడా అమలు చేస్తున్నారు. దీని పరిధిలో 6 సంవత్సరాల లోపు పిల్లలు, గర్భిణులు, పాలిచ్చే తల్లులు, ఆకాంక్షిత జిల్లాలు, ఈశాన్య రాష్ట్రాల్లోని 14 నుంచి 18 సంవత్సరాల వయస్సు గల కౌమార దశ (టీనేజ్) బాలికలు లబ్ధిదారులుగా ఉంటారు.

మెరుగైన పోషకాహార పంపిణీతో పాటు ముందస్తు బాల్య సంరక్షణ, విద్య (ఈసీసీఈ) కార్యకలాపాలు అందించేందుకు దేశవ్యాప్తంగా 2 లక్షల అంగన్‌వాడీ కేంద్రాలను సక్షమ్ అంగన్‌వాడీలుగా ఉన్నతీకరించేందుకు ఆమోదం లభించింది. ఈ సక్షమ్ అంగన్‌వాడీల్లో అత్యాధునిక మౌలిక వసతులు కల్పిస్తున్నారు. వాటిలో ఎల్ఈడీ స్క్రీన్లు, నీటి వడపోత వ్యవస్థ, పోషణ్ వాటిక, ఈసీసీఈ బోధనా సామాగ్రి, భవనాన్నే బోధనా సాధనంగా మార్చేబాలా పెయింటింగ్‌లు ఏర్పాటు చేస్తున్నారు.

జాతీయ ఆహార భద్రతా చట్టం 2013 లోని షెడ్యూల్–ఎ ఆధారంగా 6 నెలల నుంచి 6 సంవత్సరాల పిల్లలు, గర్భిణులు, బాలింతలు, టీనేజ్ బాలికలకు అదనపు పోషకాహారాన్ని అందిస్తున్నారు. ఈ పోషకాహార నిబంధనలను 2023 జనవరిలో సవరించారు. గతంలో ఉన్న పాత నిబంధనలు కేవలం క్యాలరీల ఆధారంగా మాత్రమే ఉండేవి. కానీ ఈ సవరించిన నూతన నిబంధనలు ఆహార వైవిధ్య సూత్రాలపై ఆధారపడి, పోషకాహార పరిమాణంతో పాటు నాణ్యత పరంగా ఎంతో సమగ్రంగా, సమతుల్యంగా రూపొందించారు. అంతేకాకుండా తీవ్రమైన పోషకాహార లోపంతో బాధపడుతున్న (ఎస్ఏఎం) పిల్లలకు ప్రత్యేకంగా అదనపు పోషకాహారాన్ని 'టేక్ హోమ్ రేషన్' రూపంలో అందిస్తున్నారు.

ఈ పథకాన్ని కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఐసీటీ ఆధారిత పాలనా సాధనమైన 'పోషణ్ ట్రాకర్' అనే డిజిటల్ అప్లికేషన్ ద్వారా పూర్తి డిజిటల్ పద్ధతిలో పర్యవేక్షిస్తూ, క్రమం తప్పకుండా సమీక్షిస్తోంది. ఈ అప్లికేషన్ సహాయంతో అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు, అంగన్‌వాడీ కార్యకర్తల కార్యకలాపాలు, నిర్దేశిత సూచికల ఆధారంగా లబ్ధిదారుల వివరాలను ఎప్పటికప్పుడు తాజా సమాచారంతో నమోదు చేయడానికి, ట్రాక్ చేయడానికి వీలవుతుంది. దీనికి సంబంధించి రాష్ట్రాల వారీగా గుర్తించిన లబ్ధిదారుల వివరాలు, వారు సాధించిన పురోగతికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని పోషణ్ ట్రాకర్ అధికారిక వెబ్‌సైట్ లింక్ ద్వారా తెలుసుకోవచ్చు.

పిల్లల్లో తీవ్రమైన పోషకాహార లోపాన్ని నివారించి, దానికి చికిత్స అందించడంతో పాటు సంబంధిత అనారోగ్యాలు, మరణాలను తగ్గించే లక్ష్యంతో మహిళా, శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖ.. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖలు సంయుక్తంగా 'పిల్లల్లో పోషకాహార లోప నిర్వహణ ప్రోటోకాల్'ను విడుదల చేశాయి. ఈ సమాజ ఆధారిత విధానం ద్వారా సమాజంలో తీవ్ర పోషకాహార లోపంతో ఉన్న పిల్లలను సకాలంలో గుర్తించి పరీక్షలు నిర్వహిస్తారు. ఎలాంటి వైద్యపరమైన సంక్లిష్టతలు లేని పిల్లలకు ఇంట్లోనే లభించే పౌష్టికాహారంతో పాటు అవసరమైన ఆరోగ్య సంరక్షణ అందిస్తూ వారిని కోలుకునేలా చేస్తారు. ప్రజలు మంచి పోషకాహార అలవాట్లను అలవర్చుకోవాలంటే వారి ఆలోచనా విధానంలో మార్పు రావాలి. దీనికి నిరంతర కృషి అవసరం కాబట్టి, ఈ పథకంలో భాగంగా ప్రజలను చైతన్యపరచడం, పోషకాహారంపై అవగాహన కల్పించడం అనేవి ప్రధాన కార్యక్రమాలుగా చేపట్టారు. ఇందుకోసం ప్రతి ఏటా సెప్టెంబర్ నెలలో పోషణ్ మాహ్ (పోషకాహార మాసం), మార్చి–ఏప్రిల్ నెలల్లో పోషణ్ పఖ్వాడా (పోషకాహార పక్షోత్సవాలు) నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాల సమయంలో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు జన్ ఆందోళన్ (ప్రజా ఉద్యమం) పేరిట విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాయి.

ప్రజల ఆహార అలవాట్ల లో సానుకూల మార్పులు తేవడంలో సమాజ ఆధారిత కార్యక్రమాలు (సీబీఈలు) చాలా బాగా ఉపయోగపడుతున్నాయి. ప్రతి అంగన్‌వాడీ కార్యకర్త తప్పనిసరిగా నెలకు రెండుసార్లు ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. నీతి ఆయోగ్ 2020లో పోషణ్ అభియాన్‌పై తృతీయ పక్ష మూల్యాంకనం, ప్రభావ అంచనాను నిర్వహించింది.

# 'వికసిత్ వైబ్రంట్ విలేజ్ కార్యక్రమం-2026'లో పాల్గొన్నవారితో జులై 26న ముచ్చటించనున్న పీఎం

న్యూఢిల్లీ, జులై 25:'వికసిత్ భారత్ వైబ్రంట్ కార్యక్ర మం-2026'లో పాల్గొన్నవారితో 2026, జులై 26 సాయంత్రం 4:30 గంటలకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముచ్చటిస్తారు.

మై భారత్ పోర్టల్ ద్వారా వికసిత్ వైబ్రంట్ విలేజ్ కార్యక్రమం అమలవుతోంది. భారత దేశ సరిహద్దు గ్రామాలను... దేశంలో తొలి గ్రామాలుగా పరిగణించాలనే, వికసిత్ భారత్ దిశగా చేస్తున్న ప్రయాణంలో వాటిని క్రియాశీలక భాగస్వాములుగా మార్చాలనే ప్రధాన మంత్రి ఆలోచనకు వాస్తవ రూపం ఇచ్చేలా ఈ కార్యక్రమం రూపుదిద్దుకుంది. 'వికసిత్ వైబ్రంట్ విలేజ్ కార్యక్రమం-2026'ను 2026, జూన్ 4 నుంచి 30 వరకు రెండు దశల్లో నిర్వహించారు. లదాఖ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లోని 74 వైబ్రంట్ గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతీయ స్థాయిలో నిర్వహించిన ఈ ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతా లకు చెందిన మూడు లక్షల మందికి పైగా పాల్గొన్నారు. ఈ పోటీల నుంచి 400 మందిని ఎంపిక చేశారు.

ఎంపికైన వారు ఈ కార్యక్రమంలో భాగంగా స్థానిక సమాజాలతో కలిసి నివసించారు. స్వచ్ఛతా కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కార్యక్రమాలు, యువ సమ్మేళనాలు, సాంస్కృతిక వినిమయం, మొక్కలు నాటే కార్యక్రమాలు నిర్వహించారు. పంచాయతీ నమూనా సమావేశాలు, స్థానిక చేతివృత్తుల వారితో చర్చలు చేపట్టారు. వ్యూహాత్మక ప్రాధాన్యమున్న సంస్థలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారికి భారత దేశ సరిహద్దు ప్రాంతాల సామాజిక, ఆర్థిక పరిస్థితులు, సాంస్కృతిక వారసత్వం, అభివృద్ధి ఆకాంక్షల గురించి ప్రత్యక్షంగా తెలుసుకొనే అవకాశం లభించింది. అదే సమయంలో ప్రజల భాగస్వామ్యాన్ని, జాతీయ సమగ్రతను, వ్యూహాత్మక ప్రాధాన్యం ఉన్న సరిహద్దు గ్రామాలపై అవగాహనను పెంపొందించింది.

# ఏకలవ్య జయంతి సందర్భంగా నివాళులర్పించిన డీసీసీ అధ్యక్షులు..



మహబూబ్‌నగర్, జులై 25:ఏకలవ్య జయంతి సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా పద్మావతి కాలనీలోని గ్రీన్‌బెల్ట్‌లో ఏర్పాటు చేసిన ఏకలవ్యుని విగ్రహానికి మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు శ్రీ ఏ. సంజీవ్ ముదిరాజ్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు

ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షులు శ్రీ ఏ. సంజీవ్ ముదిరాజ్ మాట్లాడుతూ, గురు భక్తి, క్రమశిక్షణ, అంకితభావం, ఆత్మవిశ్వాసానికి ఏకలవ్యుడు చిరస్థాయి ప్రతీక అని అన్నారు. అవకాశాలు లేకపోయినా తన పట్టుదలతో చరిత్రలో నిలిచిపోయిన మహనీయుడిగా ఏకలవ్యుడు యువతకు ఆదర్శమని పేర్కొన్నారు.

నేటి యువత ఏకలవ్యుని స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని విద్య, క్రీడలు, సమాజ సేవ వంటి ప్రతి రంగంలో కృషి చేసి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన పిలుపునిచ్చారు.

సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, నాణ్యమైన విద్య ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేయడం కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతమని, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని శ్రీ ఏ. సంజీవ్ ముదిరాజ్ తెలిపారు.

ఏకలవ్యుని త్యాగం, క్రమశిక్షణ, పట్టుదల ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని, ఆ ఆదర్శాలతో సమానత్వ సమాజ నిర్మాణానికి అందరూ కృషి చేయాలని డీసీసీ అధ్యక్షులు శ్రీ ఏ. సంజీవ్ ముదిరాజ్ ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో ఏకలవ్య జిల్లా అధ్యక్షుడు లాల్కోట శ్రీనివాసులు మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ శ్రీ ఒబేదుల్లా కొత్వాల్, మహబూబ్‌నగర్ మేయర్ శ్రీమతి గుమ్మళ్ల మమత శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ శ్రీమతి బెక్కరి అనితా రెడ్డి, డీసీసీ ఎస్సీ సెల్ అధ్యక్షులు శ్రీ పసుల రాజు, కార్పొరేటర్లు శ్రీ ప్రవీణ్ కుమార్, శ్రీ ఉమర్ కొత్వాల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు మరియు అభిమానులు పాల్గొన్నారు.

# ఆరుతడి పంటలతోనే అధిక ఆదాయం సాధ్యం..

**-ప్రస్తుత పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలి**

**-ఐనవోలు మండలంలో పెసర, ఆయిల్‌పామ్, మామిడి తోటలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**



వరంగల్, జులై 25:ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రైతులు తక్కువ నీటి అవసరమయ్యే ఆరుతడి, ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసి అధిక ఆదాయం పొందాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సూచించారు.

శనివారం ఐనవోలు మండలం సింగారం, పున్నేలు గ్రామాల్లో పర్యటించిన కలెక్టర్, రైతులు సాగు చేస్తున్న పెసర, ఆయిల్‌పామ్ పంటలతో పాటు మామిడి తోటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సింగారం గ్రామానికి చెందిన రైతు ఆకారపు పురుషోత్తం రెడ్డి మూడు ఎకరాల్లో ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటి వినియోగంతో పెసర పంటను సాగు చేయడాన్ని కలెక్టర్ అభినందించారు. అనంతరం రైతులతో మాట్లాడి ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో వరికి బదులుగా ఏయే పంటలు అనుకూలంగా ఉంటాయో తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ పెసర, మినుములు, కందులు వంటి పంటలకు తక్కువ నీరు అవసరమవుతుందని, 60-70 రోజుల్లో దిగుబడి రావడంతో పాటు మార్కెట్లో మంచి ధర కూడా లభిస్తోందని తెలిపారు. ఈ పంటల సాగుపై ఆసక్తి చూపుతున్నట్లు కలెక్టర్‌కు వివరించారు.

అనంతరం పున్నేలు గ్రామంలో రైతు వేల్పుల రమేష్ ఆరున్నర ఎకరాల్లో సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ తోటను కలెక్టర్ పరిశీలించారు. పంట సాగు కాలం, దిగుబడి, ఆదాయం వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇదే గ్రామానికి చెందిన రైతు రాజారపు బాలరాజు కూడా ఆయిల్‌పామ్ మొక్కలు నాటినట్లు కలెక్టర్‌కు తెలిపారు.

అలాగే రైతు రవికిరణ్ రెడ్డి మూడు ఎకరాల్లో సాగు చేస్తున్న మామిడి తోటను సందర్శించి తోట నిర్వహణ, దిగుబడి, మార్కెటింగ్ తదితర అంశాలపై ఆరా తీశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రస్తుత పరిస్థితుల్లో వరి, పత్తి, మొక్కజొన్న వంటి అధిక నీటి అవసరమయ్యే పంటల కంటే పెసర, మినుములు, కందులు, వేరుశెనగ, పొద్దుతిరుగుడు, పచ్చజొన్న వంటి ఆరుతడి పంటలు రైతులకు మరింత ప్రయోజనకరమని పేర్కొన్నారు.

రైతులకు ఫామాయిల్ తో అధికాదాయం ఆయిల్‌పామ్ దీర్ఘకాలికంగా రైతులకు స్థిరమైన ఆదాయాన్ని అందించే లాభదాయక పంట అని, అనుకూల ప్రాంతాల్లో రైతులు ఈ పంట సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. ఇప్పటికే పెసర, ఆయిల్‌పామ్ సాగు ద్వారా ఆదర్శంగా నిలుస్తున్న రైతులను అభినందిస్తూ, ఇతర రైతులు కూడా ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు.

ప్రభుత్వం కూడా పెసర, మినుములు, కందుల విత్తనాలను సబ్సిడీపై అందించే దిశగా చర్యలు తీసుకుంటోందని కలెక్టర్ తెలిపారు. ఈ పర్యటనలో వ్యవసాయ శాఖ ఏడీ ఆదిరెడ్డి, ఉద్యాన శాఖ జిల్లా అధికారి కమలాకర్ రెడ్డి, స్థానిక తహసీల్దార్ విక్రమ్ కుమార్, సంబంధిత శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# పేదల షెడ్లను బుల్డోజర్లతో కూల్చేసిన కాంగ్రెస్ సర్కార్..




సంగారెడ్డి, జులై 25: (నేటినిజం ప్రతినిధి): కాంగ్రెస్ సర్కార్ బుల్డోజర్లతో మరోసారి పేదల ఇండ్లపై రఘులుం ప్రదర్శించింది. కాంగ్రెస్ ప్రభుత్వం కనికరం లేకుండా సంగారెడ్డి జిల్లాలో పేదల షెడ్లు కూల్చివేసింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో నారాయణఖేడ్ నియోజకవర్గంలోని మనూరు మండలం బిల్లాపూర్‌లో పేదలకు ప్రభుత్వ భూమిలో మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి పట్టాలు పంపిణీ చేశారు. పట్టాలు ఇచ్చిన స్థలంలో పేదలు షెడ్లు వేసుకొని చిరువ్యాపారాలు నడుపుకుంటూ జీవనోపాధి పొందుతున్నారు.

ఆ భూముల్లో వ్యాపారాలు చేసుకుంటున్న వారికి ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా స్థానిక కాంగ్రెస్ ఎమ్మెల్యే సంజీవ రెడ్డి అండతో అధికారుల దౌర్జన్యం చేస్తున్నారు. తమ షెడ్లను ఎందుకు కూల్చుతున్నారో తెలుపకుండా అధికారులు రాత్రికి రాత్రి బుల్డోజర్లతో షెడ్లను కూల్చివేశారు.

# వృత్తి నైపుణ్యం పెంపొందించుకోవాలి..

**-పోలీసు సిబ్బందికి కంప్యూటర్ పరిజ్ఞానంపై ప్రత్యేక శిక్షణ**

**-రెండో బ్యాచ్ శిక్షణ ముగింపు కార్యక్రమంలో అదనపు ఎస్పీ చైతన్యరెడ్డి**

సంగారెడ్డి, జులై 25: (నేటినిజం ప్రతినిధి): పోలీసు సిబ్బందికి వృత్తిరిత్యా నైపుణ్యాలను పెంపొందించేందుకు వోక్సెన్ యూనివర్సి నిర్వహిస్తున్న రెండో బ్యాచ్ శిక్షణ ముగింపు కార్యక్రమానికి సంగారెడ్డి అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శిక్షణ పూర్తిచేసుకున్న పోలీసు సిబ్బందికి సర్టిఫికెట్లు అందజేశారు.

ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ.. ప్రస్తుతం పోలీసు శాఖలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం విస్తృతమవుతున్న నేపథ్యంలో సిబ్బంది ఆధునిక సాఫ్ట్‌వేర్‌లపై పట్టు సాధించడం అత్యంత అవసరమని తెలిపారు. ఎంఎస్ ఆఫీస్, ముఖ్యంగా వర్డ్, ఎక్సెల్ వంటి సాఫ్ట్‌వేర్లలో ప్రావీణ్యం ద్వారా కార్యాలయ పనితీరులో వేగం, ఖచ్చితత్వం, సమర్థత మరింత మెరుగుపడుతుందని అదనపు ఎస్పీ పేర్కొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది, స్టేషన్ రైటర్లు, సైబర్ వారియర్స్, టెక్ టీమ్ మొత్తం 180 మంది సిబ్బందిని 3 బ్యాచ్‌లుగా విభజించి, ప్రతి బ్యాచ్‌కు 3 రోజుల చొప్పున శిక్షణ ఇస్తున్నారు. ప్రతి ఒక్కరూ సాంకేతిక పరిజ్ఞానాన్ని తమ పనితీరును మెరుగుపరచుకునేందుకు ఒక సాధనంగా ఉపయోగించుకోవాలని సూచించారు.

పోలీసు శాఖలో సేవల నాణ్యతను పెంచడంలో ఇటువంటి నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. వోక్సెన్ యూనివర్సిటీ యాజమాన్యం, ప్రొఫెసర్లకు పోలీసు శాఖ తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ డీన్ డా.దయాశంకర్, అసిస్టెంట్ డీన్స్, ప్రొఫెసర్స్, జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# భిక్కనూరు బీఆర్ఎస్ నేతలతో ఎస్ఐఆర్‌పై మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ సమీక్ష

కామారెడ్డి, జులై 25: ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం పురోగతిపై శనివారం బిఆర్ఎస్ కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ భిక్కనూరు మండల స్థాయి నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఈ ఫామ్‌ల డిజిటలైజేషన్ పురోగతిని పరిశీలించారు. ప్రస్తుతం మండలంలో 99 శాతం డిజిటలైజేషన్ పూర్తైందని, మిగిలిన ఫామ్‌లను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాలో నమోదయ్యేలా, కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పులు, వివరాల సవరణలో పార్టీ కార్యకర్తలు ః ఒూలకు సహకరించాలని నిర్ణయించారు. ప్రతీ బూత్‌లో 100 శాతం లక్ష్య సాధనకు ప్రత్యేక దృష్టి సారించాలని సమావేశంలో తీర్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు, జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# క్రీడా దుస్తుల పంపిణీ

**-వాలీబాల్ క్రీడాకారులకు అందించిన వీడీసీ చైర్మన్**




నిజామాబాద్, జులై 25: కమ్మర్‌పల్లి వాలీబాల్ అసోసియేషన్ క్రీడాకారులకు వీడీసీ చైర్మన్ మల్యాల సుభాష్ గౌడ్ తన స్వంత ఖర్చుతో క్రీడా దుస్తులను అందజేశారు. శనివారం మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వైలారం సుధాకర్‌తో కలిసి క్రీడా దుస్తులను ఆవిష్కరించి క్రీడాకారులకు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లాలో ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాలీబాల్ టోర్నమెం ట్‌లో కమ్మర్‌పల్లి వాలీబాల్ అసోసియేషన్ జట్టు పాల్గొంటోందన్నారు. గతంలో నిజామాబాద్‌లో జరిగిన పోటీల్లో కమ్మర్‌పల్లి జట్టు రెండుసార్లు ప్రథమ బహుమతి సాధించి ప్రతిభ చాటిందని గుర్తు చేశారు. ప్రస్తుతం కొండాపూర్ జట్టుతో తలపడనున్న కమ్మర్‌పల్లి జట్టు విజయం సాధించి తదుపరి జిల్లాస్థాయి పోటీలకు అర్హత సాధించాలని ఆకాంక్షించారు. జిల్లాస్థాయి పోటీల్లో విజయం సాధిస్తే రాష్ట్రస్థాయిలో కోయంబత్తూరులో జరిగే తుది పోటీల్లో పాల్గొనేందుకు అవసరమైన సహాయాన్ని తన స్వంత ఖర్చుతో అందిస్తానని మల్యాల సుభాష్ గౌడ్ హామీ ఇచ్చారు. ఈ టోర్నమెంట్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చి ప్రథమ బహుమతి సాధించాలని క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో క్రీడాకారులు మహేష్, ప్రణీత్, అఖిల్, అజయ్, శ్రావణ్, అరుణ్, సతీష్, యోగేష్, నందు, భూమేష్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం లక్ష్యం

**-వ్యవసాయ మార్కెట్‌లో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన**



మహబూబ్‌నగర్, జులై 25:నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని నెల్లికొండ వ్యవసాయ మార్కెట్ ఆవరణలో కవర్ షెడ్, సి.సి. పేవ్‌మెంట్, చైర్మన్ చాంబర్ మరియు సమావేశ మందిరం నిర్మాణ పనులకు గౌరవ ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి శనివారం శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రైతులకు ఆధునిక సౌకర్యాలు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. వ్యవసాయ మార్కెట్‌లో మౌలిక వసతులను మెరుగుపరచడం ద్వారా రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను సౌకర్యవంతంగా విక్రయించే అవకాశం లభిస్తుందని అన్నారు. మార్కెట్‌కు వచ్చే రైతులు, వ్యాపారులు మరియు సిబ్బందికి అవసరమైన అన్ని సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ రావు ,మునిసిపల్ చైర్మన్ తీగల సునేంద్ర ,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జంగయ్య , డైరెక్టర్ లు ప్రజాప్రతినిధులు, మార్కెట్ కమిటీ సభ్యులు, స్థానిక కౌన్సిలర్స్ , అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# గంజాయి, వీడ్ ఆయిల్ స్మగ్లింగ్ ముఠా అరెస్ట్

నల్గొండ, జులై 25: ఒడిశా నుండి గంజాయి, వీడ్ ఆయిల్ స్మగ్లింగ్ చేస్తున్న 8 మంది అంతరాష్ట్ర ముఠాను నల్లగొండ వన్ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుండి రూ.10 లక్షల విలువైన 5.6 కిలోల గంజాయి, 100 ఓఒ వీడ్(హాష్) ఆయిల్, 5 బైక్‌లు, 4 సెల్‌ఫోన్లు, డమ్మీ తుపాకీ, బట్టన్ చాకు స్వాధీనం చేసుకు న్నారు. కేసు వివరాలను నల్లగొండ డీఎస్పీ కె.శివరాం రెడ్డి శనివారం వెల్లడించారు. శుక్రవారం ఉదయం 11:00 గంటలకు నల్లగొండ పట్టణం మునుగోడు బైపాస్ రోడ్డులోని ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో కొంతమంది యువకులు గుమి గూడి గంజా యిని విక్రయిస్తూ, వినియోగిస్తు న్నారనే విశ్వసనీయ సమాచార ంతో నల్లగొండ వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఏమిరెడ్డి రాజశే ఖర్ రెడ్డి నేతృత్వంలో రైడ్ చేసి 8 మందితో పాటు ఓ మైనర్‌ను అదుపులోకి తీసుకున్న ట్లు తెలిపారు. అదుపులోకి తీసుకున్న నిందితులను కస్పరాజు నాగరా జు(20), గంటె కంపు మధు(22), చెన్నపాక సుశాంక్(23), పెంద్ర వాసు (19), సయ్యద్ షోయబ్ (21), గంధం శివమణి(19), నకిరేకంటి ధరణి కుమార్(19)గా గుర్తించినట్లు వీరితో పాటు ఓ బాలుడు ఉన్నట్లు వెల్లడించారు. కాగా మనుకర్ నివాసం, హరి నివాసం, ఉదయ్, జున్ను పరారీలో ఉన్నట్లు చెప్పారు.

కేసును చాకచక్యంగా నల్లగొండ డీఎస్పీ శివరాం రెడ్డి గారి పర్యవేక్షణలో ఛేదించిన వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఏమిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, ఎస్.ఐ లు సురభి సంపత్, ముత్తయ్య, సిబ్బంది శ్రీనివాస్, శేఖర్, రబ్బా ని, సాగర్ల శంకర్, ఆంజనే యు లు, అంజద్ ,కిరణ్ అంజయ్య, ప్రత్యేకంగా అభినందించారు.

# వనదుర్గమ్మ సన్నిధిలో జిల్లా విద్యాధికారి



మెదక్, జులై 25: మెదక్ జిల్లా విద్యాశాఖ అధికారి రాజు శనివారం ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వన దుర్గ భవాని మాతను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన జిల్లా విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం మొట్టమొదటిసారిగా అమ్మవారిని దర్శించుకున్నారు.

ఈ సందర్భంగా ఆలయ పండితులు శంకర శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. డీఈవో రాజుకు వేద పండితులు ఏడుపాయల ఆలయ ప్రశస్తిని వివరించారు. ఆయన వెంట అక్షయ పాత్ర మెదక్ ప్లాంట్ మేనేజర్ త్రిపాఠి, పవన్ కుమార్, రాకేష్ కుమార్, భట్టు నాగరాజు, వికాస్ రాజు, బత్తిని రాజు ఉన్నారు

# అంతర్జాతీయ మడ అడవుల పరిరక్షణ దినోత్సవం - సముద్రతీరానికి సజీవ రక్షణ కవచం

ప్రకృతి ప్రపంచానికి మనుషుల జీవితానికి ఊపిరిగా నిలిచే అద్భుత సంపదలలో మడ అడవులు (Mangrove forests) ఒక విశిష్టమైన స్థానాన్ని ఆక్రమించు కున్నాయి. సముద్ర తీర ప్రాంతాల్లో ఉప్పు నీటిలో పెరిగే ఈ చెట్ల సమూహారాలు పర్యావరణ సమతుల్యతకు మూల స్తంభాలుగా నిలుస్తూ, ప్రకృతి ప్రకోపాలను తట్టుకునే సహజ శక్తిని సమకూర్చుతున్నాయి. మడ అడవుల ప్రాముఖ్యతను చాటి చెప్పేందుకు, వాటిని రక్షించాల్సిన బాధ్యతను గుర్తు చేయడానికి ప్రతి సంవత్సరం జూలై 26న అంతరాజ్తీయ మడ అడవుల పర్యావరణ వ్యవస్థ పరిరక్షణ దినోత్సవం ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటారు. ఐక్యరాజ్య సమితి విద్యా, శాస్త్ర, సాంస్కృతిక సంస్థ అయిన యునెస్కో ఈ దినోత్సవాన్ని 2015లో అధికారికంగా ప్రకటించింది.

మడ అడవులు భూమి, సముద్రం మధ్య సహజంగా ఏర్పడే సరిహద్దుల్లా వ్యవహరిస్తూ, తీరప్రాంతాల్లో నివసించే ప్రజల జీవితాలను రక్షిస్తాయి. తుఫానులు, సునామీలు వంటి ప్రకృతి విపత్తుల వేళ సముద్ర అలల తీవ్రతను తట్టుకుని భూభాగాన్ని కాపాడే తొలి రక్షణ రేఖగా నిలుస్తాయి. వీటి వేర్లు గాలిలోకి పైకి కనిపించే విధంగా పెరగడం, అధిక ఉప్పు నీటిని తట్టుకునే సామర్థ్యం కలిగి ఉండటం వంటి విశిష్ట లక్షణాలతో మడ చెట్లు ప్రకృతిలో విలక్షణంగా నిలుస్తాయి.

ఈ అడవులు జీవ వైవిధ్యానికి నిలయాలుగా పనిచేస్తాయి. అనేక రకాల చేపలు, రొయ్యలు, తాబేళ్లు, పక్షులు, పీతలు, సముద్ర కీటకాలు ఇవి నివాసముంటే శ్రేష్ఠమైన ప్రాంతాలుగా ఉపయోగించుకుంటాయి. ప్రపంచ వ్యాప్తంగా సుమారు 4,000 రకాల వృక్ష జాతులు, 2,000 రకాల జంతు జాతులు మడ అడవుల్లో నివసిస్తున్నట్లు పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి. ఇవి సముద్ర జీవుల ఉత్పత్తికి వేదికగా, మత్స్యకారులకు జీవనాధారంగా, తీర ప్రాంతాల ప్రజలకు జీవనోపాధిగా నిలుస్తున్నాయి.

మడ అడవులు గాలిలోని కార్బన్ డయాక్సైడ్‌ను గ్రహించి భద్రపరిచే శక్తిలో ఎంతో ముందంజలో ఉన్నాయి. సాధారణ భూమిపై ఉండే అడవుల కంటే నాలుగు నుండి పది రెట్లు ఎక్కువగా కార్బన్‌ను ఇవి నిల్వ చేయగలవు. దీన్ని "బ్లూ కార్బన్" అంటారు. గ్లోబల్ వార్మింగ్‌ను నియంత్రించడంలో ఇవి అసాధారణ పాత్ర పోషిస్తున్నాయి. అంతేగాక, నదుల ద్వారా వచ్చే కాలుష్య నీటిని వడపోసి, సముద్రానికి శుద్ధమైన నీటిని అందించడం ద్వారా నీటి నాణ్యతను మెరుగు పరుస్తాయి.

అయితే మడ అడవులు ఇప్పుడు ఎన్నో ముప్పులకు గురవుతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా గత కొన్ని దశాబ్దాల్లో 35 శాతం మడ అడవులు నశించి పోయినట్లు అంచనా. ముఖ్యంగా సముద్రతీర ప్రాంతాల పట్టణీకరణ, పోర్టుల నిర్మాణం, రొయ్యల చెరువుల విస్తరణ, పర్యాటకాభివృద్ధి పేరిట వీటిని విచక్షణ లేకుండా నరకడం జరుగుతోంది. పారిశ్రామిక కాలుష్యం, ప్లాస్టిక్ వ్యర్థాలే కాక వాతావరణ మార్పుల కారణంగా సముద్ర మట్టం పెరగడం కూడా మడ అడవుల మనుగడకు ముప్పుగా మారింది.

**జూలై 26...అంతర్జాతీయ మడ అడవుల పర్యావరణ వ్యవస్థ పరిరక్షణ దినోత్సవం**



భారత దేశంలో సుందర్బన్ మడ అడవి (పశ్చిమ బెంగాల్) ప్రపంచంలోనే అతిపెద్ద మడ అడవిగా ప్రసిద్ధి చెందగా, ఆంధ్ర ప్రదేశ్‌లోని గోదావరి డెల్టా, పులికాట్ సరస్సు, ఒడిశాలోని భితర్కనికా, గుజరాత్‌లోని గల్ఫ్ ఆఫ్ కచ్ వంటి ప్రాంతాల్లో మడ అడవులు విస్తరించి ఉన్నాయి.

**మడ అడవులు గాలిలోని కార్బన్ డయాక్సైడ్‌ను గ్రహించి భద్రపరిచే శక్తిలో ఎంతో ముందంజలో ఉన్నాయి. సాధారణ భూమిపై ఉండే అడవుల కంటే నాలుగు నుండి పది రెట్లు ఎక్కువగా కార్బన్‌ను ఇవి నిల్వ చేయగలవు. దీన్ని "బ్లూ కార్బన్" అంటారు. గ్లోబల్ వార్మింగ్‌ను నియంత్రించడంలో ఇవి అసాధారణ పాత్ర పోషిస్తున్నాయి.**

అయితే ఇటీవలి సంవత్సరాల్లో వీటి విస్తీర్ణం క్షీణిస్తున్నదీ పరిశోధనలు తెలుపు తున్నాయి.

ఈ పరిస్థితుల మధ్య మడ అడవుల పరిరక్షణ కోసం ప్రభుత్వాలు వలు కార్యక్రమాలను ప్రారంభించాయి. ముఖ్యంగా ఇంటిగ్రేటెడ్ కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్ట్, మిషన్ ఫర్ సస్టెయినబుల్ మడ డెవలప్‌మెంట్, మిషన్ లైఫ్ వంటి కేంద్ర ప్రణాళికలు అమలులో ఉన్నప్పటికీ, ప్రజల భాగస్వామ్యం, విద్యా సంస్థల చొరవ, శాస్త్రీయ పద్ధతుల అనుసరణ అవసరం. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 48ం ప్రకారం పర్యావరణ పరిరక్షణ ప్రభుత్వ ప్రధాన బాధ్యత. కానీ దీనిని పౌరుల ధర్మంగా కూడా భావించాల్సిన అవసరం ఉంది.

ఈ నేపథ్యంలో ప్రతి జూలై 26న జరుపుకునే అంతర్జాతీయ మడ అడవుల పరిరక్షణ దినోత్సవం, మడ అడవుల ప్రాముఖ్యతను గుర్తు చేసుకునే ఒక చైతన్య దినంగా మారాలి. ప్రకృతికి రక్షణ కవచంగా నిలిచే ఈ అడవులను కాపాడటం ద్వారా, మన భవిష్యత్తును కూడా కాపాడగలమనే సందేశం ప్రజలందరికీ చేరాలి.

మడ అడవులు ప్రకృతికి ఒక జీవనరేఖ. సముద్రాన్ని సంరక్షించే కవచం. మానవాళికి రక్షణ వలయాలు. ఈ దినోత్సవాన్ని ఒక ప్రజా ఉద్యమంగా మార్చి, ప్రకృతిని కాపాడే బాధ్యతను మనందరం కలసి భుజాన వేసుకుందాం.



-రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

---

# మేయర్ సుడిగాలి పర్యటన... ఇంటిగ్రేటెడ్ మార్కెట్లు, ఐసీడీఎస్ భవనం నిర్మాణ పనులపై క్షేత్రస్థాయి సమీక్ష

**-నిర్ణీత గడువులోపు నాణ్యతతో పనులు పూర్తి చేయాలి - మేయర్ కొలగాని శ్రీనివాస్**



కరీంనగర్, జులై 25: (నేటినిజం ప్రతినిధి) కరీంనగర్ నగర ప్రజలకు అత్యాధునిక మౌలిక వసతులు అందించాలనే లక్ష్యంతో కరీంనగర్ నగర మేయర్ శ్రీ కొలగాని శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ శ్రీ ప్రఫుల్ దేశాయ్ గారితో కలిసి శనివారం నగరంలోని పలు అభివృద్ధి పనులను ఆకస్మికంగా పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ వెజ్ ౘ నాన్-వెజ్ మార్కెట్లు, ఐసీడీఎస్ భవనం, పార్కింగ్ మరియు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.

ముందుగా పద్మనగర్ ఇంటిగ్రేటెడ్ వెజ్ ౘ నాన్-వెజ్ మార్కెట్ ను సందర్శించిన మేయర్, ఇప్పటికే ప్రజలకు అందుబాటులోకి వచ్చిన ఈ మార్కెట్ నిర్వహణను మరింత మెరుగుపరచాలని అధికారులకు సూచించారు. పారిశుధ్యం, వినియోగదారుల సౌకర్యాలు, వ్యాపారుల అవసరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.

అనంతరం కాశ్మీర్‌గడ్డ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులను పరిశీలించిన మేయర్, మిగిలిన పనులను వేగవంతం చేసి రాబోయే 30 రోజుల్లో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

తదుపరి కలెక్టర్ క్యాంప్ కార్యాలయం ఎదురుగా నిర్మాణంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులను సమీక్షించిన మేయర్, నిర్మాణాన్ని అత్యున్నత ప్రమాణాలతో పూర్తి చేసి మూడు నెలల్లో ప్రారంభానికి సిద్ధం చేయాలని స్పష్టం చేశారు.

అనంతరం నిర్మాణంలో ఉన్న ఐసీడీఎస్ భవనం, పార్కింగ్ మరియు షాపింగ్ కాంప్లెక్స్ పనులను మేయర్, కమిషనర్ క్షుణ్ణంగా పరిశీలించారు. భవన నిర్మాణ నాణ్యత, పార్కింగ్ సౌకర్యాలు, షాపింగ్ కాంప్లెక్స్ రూపకల్పన, విద్యుత్, తాగునీరు, డ్రైనేజీ, పారిశుధ్యం, భద్రతా ప్రమాణాలు, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులపై సమగ్ర సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని అన్ని ఆధునిక సౌకర్యాలతో భవనాన్ని పూర్తి చేయాలని, షాపింగ్ కాంప్లెక్స్‌లో వ్యాపారులకు మెరుగైన వసతులు, సందర్శకులకు విశాలమైన పార్కింగ్, సులభ రాకపోకలకు అనువైన ఏర్పాట్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

అధికారులకు మేయర్, కమిషనర్ కీలక ఆదేశాలు

-నిర్మాణ పనులను నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలి.

-నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదు.

-ప్రతిరోజూ క్షేత్రస్థాయిలో అధికారులు పర్యవేక్షణ నిర్వహించాలి.

-భవనాలు దీర్ఘకాలం ఉపయోగపడేలా ప్రమాణాలకు అనుగుణంగా నిర్మించాలి.

-పారిశుధ్యం, పార్కింగ్, ప్రజా సౌకర్యాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలి.

-అవసరమైన చోట అదనపు సిబ్బంది, యంత్రాలతో పనులను వేగవంతం చేయాలి.

ఈ సందర్భంగా మేయర్ శ్రీ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ, నగరంలో చేపడుతున్న ప్రతి అభివృద్ధి పనిని నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే తమ లక్ష్యమని తెలిపారు. ఆధునిక మార్కెట్లు, సమగ్ర పార్కింగ్ సదుపాయాలు, షాపింగ్ కాంప్లెక్స్‌లు నగరాభివృద్ధికి కొత్త దిశను చూపుతాయని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించే మౌలిక వసతుల కల్పనలో నగర పాలక సంస్థ ఎల్లప్పుడూ ముందుంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ పర్యటనలో మున్సిపల్ కమిషనర్ శ్రీ ప్రఫుల్ దేశాయ్ , డిప్యూటీ మేయర్ వై సునీల్ రావు గారు, మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

---

# సంతానలేమికి సమస్యపై సవాలు విసురుతున్న ఐవిఫ్ ప్రక్రియ

**- ప్రముఖ ఐవిఎఫ్ వైద్యురాళ్లు డాక్టర్ రజనీ ప్రియదర్శిని, డాక్టర్ : అనమల్ల శ్రీదేవి**



హైదరాబాద్, జులై 25: సంతానలేమి సమస్యలతో బాధపడుతున్న దంపతులకు ఒక అద్భుతమైన వరంగా ఐవిఎఫ్ ప్రక్రియ నిలుస్తున్నదని ప్రముఖ ఐవిఎఫ్ వైద్యురాళ్లు రెనీ ఆసుపత్రి డాక్టర్ : బంగారి రజనీ ప్రియదర్శిని, రోహన్ ఆసుపత్రి డాక్టర్: అనమల్ల శ్రీదేవి నరేష్ అన్నారు. ఈ రోజు శాతవాహన లయన్స్ క్లబ్ నిర్వహించిన ప్రపంచ ఐవిఫ్ దినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ నేడు ప్రతి పట్టణంలో ఐవిఎఫ్ చికిత్సను అందించే ఆధునిక ఆసుపత్రులు అందుబాటులోకి రావడం శుభపరిణామం అని అన్నారు. కార్యక్రమ సమన్వయకర్త లయన్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ దాదాపు 48 ఏండ్ల క్రితం తొలి టెస్ట్ ట్యూబ్ బేబీ జన్మించడం జరిగిందని, నాటి నుంచి నేటి వరకు వైద్యరంగంలో వస్తున్న శాస్త్రసాంకేతిక మార్పులతో ఐవిఎఫ్ ప్రక్రియతో పిల్లల్ని కనడం సర్వసాధారణం కావడం సంతోషకరం అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బంగారి రజనీ ప్రియదర్శిని, డాక్టర్ అనమల్ల శ్రీదేవిలను శాతవాహన లయన్స్ క్లబ్ నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో లయన్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డితో పాటు అధ్యక్షులు మర్రిపల్లి మహేందర్, కార్యదర్శి నార్ల వేణుగోపాల్, ఉపాధ్యక్షులు డాక్టర్ వి శ్రీనివాస్, లయన్ కోట సత్యం, లయన్ మేకల అరవింద్ కుమార్ తదితరులు పాల్గొని వైద్యురాళ్లను సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

---

# శాంతి భద్రతలే లక్ష్యం..

**- డీఎస్పీ నాగేంద్రచారి**

**రాజీవ్ నగర్‌లో పోలీసుల కమ్యూనిటీ కాంటాక్ట్**

**60 బైక్‌లు, 3 లీటర మద్యం స్వాధీనం**

రాజన్న సిరిసిల్ల, జులై 25:(నేటినిజం ప్రతినిధి): జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఆదేశాల మేరకు సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి ఆధ్వర్యంలో రాజీవ్‌నగర్‌లో



కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్ర మం నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు, నంబర్ ప్లేట్లు లేని 60 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసు కుని, సంబంధిత యజ మానులు పత్రాలు సమర్పించి వాహనాలను తీసుకెళ్లాలని సూచించారు. అలాగే నిబంధనలకు విరుద్ధంగా బెల్ట్ షాప్ నిర్వహిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి 3 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. నేరాల నియంత్రణలో భాగంగా అనుమానిత వ్యక్తులను తనిఖీ చేసి వారి వివరాలు సేకరించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. ప్రజల్లో భద్రతాభావం పెంపొందించడం, అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడమే కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని డీఎస్పీ తెలిపారు. కాలనీల్లో స్వీయ రక్షణ కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. గంజాయి అక్రమ రవాణా, నిల్వ, విక్రయాలపై సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ శ్రీనివాస్, ఎస్ఐలు నాగరాజు, గణేష్, రంజిత్, ఆర్ఎస్ఐ శ్రీనివాస్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

---

# 'నేరానికి పాల్పడితే ఎంతటి వారైనా శిక్షార్హులే'

**-జూనియర్ సివిల్ జడ్జి కాసరగడ్డ దీప**

నల్గొండ, జులై 25:నేరానికి పాల్పడిన వారు ఎంతటి వారైనా చట్ట ప్రకారం శిక్షార్హులేనని, చట్టం ఎవరికి చుట్టము కాదని హుజూర్‌నగర్ ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి కాసరగడ్డ దీప అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఒక చట్టాన్ని రూపొందించినప్పుడు అందులో పౌరుల హక్కులు విధుల గురించి పేర్కొనబడుతుందని, ఆ చట్టంలో ఉండే అన్ని విషయాలు పౌరులకు తెలిసినట్లుగానే భావించాలని కూడా చట్టంలో పొందుపరచబడి ఉంటుందని, అందువల్ల ఇది నేరం అని తెలియక తాము తప్పు చేశాం అంటే చట్టం మౌనంగా ఉండజాలదన్నారు. విద్యార్థినీ విద్యార్థులు డ్రగ్స్ వినియోగానికి డ్రగ్స్ ను కలిగి ఉండటానికి దూరంగా ఉండాలని అలాగే సాంకేతికతను సన్మార్గానికి వినియోగించాలే తప్ప చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు వినియోగించినట్లయితే శిక్షించబడతారన్నారు. బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడితే యావజ్జీవ కారాగార శిక్ష, మరణ శిక్ష సైతం విధించే అవకాశం ఉన్న పోక్సో, నిర్భయ లాంటి కఠిన చట్టాలు అమలులో ఉన్నాయని, అందువల్ల విద్యార్థులు నేర ప్రవృత్తికి దూరంగా ఉండాలని ఆమె సూచించారు.

ఒక లక్ష్యాన్ని ఎంచుకుని దాన్ని చేరుకోవడానికి కష్టపడి చదివి లక్ష్యాన్ని సాధించాలని విద్యార్థులకు సూచించారు. యువత మత్తుకు బానిసైతే జీవితం చిత్తవుతుందని హెచ్చరించారు. కళాశాలలలో, విద్యా సంస్థలలో ర్యాగింగ్ కు పాల్పడిన వారికి 3 సంవత్సరాల జైలు శిక్షతో పాటు జరిమానా కూడా విధించే అవకాశం ఉందని, అందువల్ల ఏ ఒక్కరు ర్యాగింగ్ కు పాల్పడ వద్దని ఆమె విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సోమపంగు రామారావు, బార్ అసోసియేషన్ కార్యదర్శి ఆర్ వి రమణారెడ్డి, న్యాయవాదులు కాల్వ శ్రీనివాసరావు, నాగేష్ రాథోడ్, కుక్కడపు సైదులు, సైదా హుస్సేన్, ఉదారి యాదగిరి, శంకర్ నాయక్, శివకృష్ణ యాదవ్, గోపీనాథ్, మహిళా న్యాయవాదులు తెప్పని శ్రీలక్ష్మి, జుట్టుకొండ సంధ్య, స్థానిక ఎస్ఐ హనుమా నాయక్, న్యాయశాఖ సిబ్బంది అనిత, సుశీల, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

---

# క్రమశిక్షణ, నిబద్ధతతో పని చేయాలి

**-విధులలో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవు- జిల్లా ఎస్పీ మహేష్ బి గితే**



రాజన్న సిరిసిల్ల, జులై 25: క్రమశిక్షణ,నిబద్ధతతో ప్రజల మన్ననలను పొందేలా ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది పని చేయాలని జిల్లా ఎస్పీ మహేష్ బి గితే తెలిపారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలోని పరేడ్ మైదానంలో జిల్లా ఆర్మ్డ్ రిజర్వ్ ,సివిల్,హోమ్ గార్డ్ సిబ్బందికి నిర్వహించిన వీక్లీ పరేడ్ కి జిల్లా ఎస్పీ గారు హాజరై గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం సిబ్బంది ప్రదర్శించిన ఆర్మ్స్ డ్రిల్, ఫుట్ డ్రిల్, లాఠీ డ్రిల్, ట్రాఫిక్ డ్రిల్ ప్రదర్శనని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, ప్రతిరోజు కనీసం అరగంట నడక చేయడం, బయట ఆహారాన్ని వీలైనంత వరకు నివారించడం, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని ఎస్పీ సూచించారు. విక్లీ పరేడ్ వల్ల సిబ్బందికి క్రమశిక్షణ,యూనిటీగా ఉండడం, ఫిజికల్ ఫిట్నెస్ కి ఉపయోగపడుతుందన్నారు. క్రమశిక్షణతో డ్యూటీలు నిర్వర్తించి ప్రజల మన్ననలు పొందేలాగా పనిచేస్తూ పోలీస్ శాఖకి, జిల్లాకి మంచి పేరు తెచ్చేలాగా పని చేయాలని అన్నారు. విధులలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని,సిబ్బందికి ఏదైనా సమస్య వుంటే ఎప్పుడైనా తనను కలుసుకొని తమ సమస్యను తెలియజేవచ్చాన్నారు. ఈపరేడ్ లో అదనపు ఎస్పీ చంద్రయ్య, ఆర్ఐ లు మధుకర్, సురేష్, రమేష్, ఆర్ఎస్ఐలు రాజు, శ్రవణ్ యాదవ్, దిలీప్, సాయి కిరణ్, ఆర్మ్డ్ సిబ్బంది, సివిల్ సిబ్బంది, హోమ్ గార్డ్ సిబ్బంది పాల్గొన్నారు.

---

# హుజూర్‌నగర్ కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా బాలకృష్ణ గౌడ్



హుజూర్‌నగర్, జూలై 25 : హుజూర్‌నగర్ కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా సీనియర్ న్యాయవాది కుక్కడపు బాలకృష్ణ గౌడ్ నియమితులయ్యారు. రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు సాముల రాంరెడ్డి శనివారం ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. అంకితభావంతో పనిచేస్తూ న్యాయస్థానాన్ని ఆశ్రయించే ప్రజలకు న్యాయ సేవలు అందించాలని సూచించారు. నూతనంగా నియమితులైన బాలకృష్ణ గౌడ్ మాట్లాడుతూ.. తనను హుజూర్‌నగర్ కోర్టుకు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు సాముల రాంరెడ్డి, హుజూర్‌నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నారపరాజు శ్రీనివాసరావు, బార్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.